మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు


NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 9-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 221 Issue: 221

Published from Jagitial www.evarthalu.com


09 ఫిబ్రవరి 2026 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:49 సూర్యాస్తమయం - సా. 6:11 తిథి అష్టమి ఉ. 7:27ం వరకు సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం విశాఖ ఉ. 7:49ం వరకు యోగం వృద్ధి రా. 12:48ం వరకు కరణం భాలవ సా. 6:14 వరకు కౌలవ ఉ. 7:27ం వరకు వర్జ్యం ఉ. 11:18 నుండి మ. 1:05 వరకు దుర్ముహూర్తం మ. 12:53 నుండి మ. 1:38 వరకు మ. 3:09 నుండి మ. 3:54 వరకు రాహుకాలం ఉ. 8:14 నుండి ఉ. 9:39 వరకు యమగండం ఉ. 11:05 నుండి మ. 12:30 వరకు గుళికాకాలం మ. 1:55 నుండి మ. 3:21 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:13 నుండి ఉ. 6:01 వరకు అమృత ఘడియలు రా. 10:03 నుండి రా. 11:51 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



# జిల్లాలను రద్దు చేయం

## అదంతా తప్పుడు ప్రచారం.. మాకు ఆ ఆలోచనే లేదు

### ఏదైనా ఉంటే ప్రజలతో చెప్తాం.. భూపాలపల్లి సభలో సీఎం రేవంత్

కొత్త జిల్లాలను ఏర్పాటు చేయబోమని, ఉన్న జిల్లాలను రద్దు చేయబోమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భూపాలపల్లి జిల్లా పర్యటనలో భాగంగా సీఎం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. గత కొద్ది రోజులుగా భూపాలపల్లి జిల్లాను రద్దు చేస్తారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి జిల్లాలను రద్దు చేసే ఆలోచన గానీ, కొత్తవాటిని ఏర్పాటు చేసే ఉద్దేశం గానీ ప్రస్తుతం లేదని తేల్చి చెప్పారు. కేవలం ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్న కొందరు వ్యక్తులు ఇలాంటి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

భూపాలపల్లి, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): జిల్లాల సరిహద్దుల మార్పులు లేదా రేషనలైజేషన్ అవసరమనిపిస్తే.. ఆ విషయాన్ని ముందుగా ప్రజల దృష్టికి తీసుకువస్తామని తెలిపారు. అసెంబ్లీ వేదికగా చర్చించి, ప్రతిపక్షాల సూచనలు, అందరి అభిప్రాయాలు తీసుకున్నాకే దీనిపై ఏదైనా నిర్ణయం ఉంటుందని హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి నష్టం చేసే పనులు చేయబోమని భరోసా ఇచ్చారు. సింగరేణి సంస్థను, కార్మికులను కాపాడుకోవడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కార్మికులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉంటాయే తప్ప, వారికి ఇబ్బంది కలిగించే చర్యలు ఉండవని స్పష్టం చేశారు. అయితే ఇటీవల మెడికల్ బోర్డు విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ స్వలాభం కోసం కార్మికులను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారాలు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సింగరేణి ప్రాంత అభివృద్ధికి, కార్మికుల కుటుంబాల శ్రేయస్సుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. జిల్లాల స్వరూపంపై వస్తున్న తరువాయి 2 వ పేజీలో...





# ల్యాబ్ ధ్వంసానికి.. రేవంత్ కుట్ర

## ఓటుకు నోటు ఆధారాల నాశనానికి ప్లాన్

## బుడ్డ బిల్డింగ్‌లో మంటలు ఆర్పేందుకు 3 గంటలా?

### హనుమకొండలో మీడియాతో కేటీఆర్

ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదం వెనుక కుట్ర ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డినే ల్యాబ్‌ను తగులబెట్టించాడని ప్రజలంతా భావిస్తున్నారని తెలిపారు. ఆధారాలు నాశనం చేసి కేసు నుంచి బయటపడాలని రేవంత్ రెడ్డి స్వయంగా కుట్ర పన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ఆధారాలు లేపేసిండని విమర్శించారు.

హనుమకొండ, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): హనుమకొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. మేమంతా మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఉండగా రేవంత్ రెడ్డి ఈ కుట్ర చేశారని ఆరోపించారు. ఓటుకు నోటు కేసు జగద్విదితమని కేటీఆర్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి 2015లో -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,660 |
| వెండి (గ్రాము): | రూ.285 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,111 |

## విశ్వవాణి



జెల్లీ ఫిష్‌లు దాదాపు చిన్నవిగానే ఉంటాయి. అత్యధికంగా ఒక మీటరు పెరుగుతాయి. కానీ అర్జెంటీనా తీర ప్రాంతంలో ఓ జెల్లీ ఫిష్ కనిపించింది. అది ఏకంగా ఒక స్కూల్ బస్సు అంత పెద్దగా ఉండటం గమనార్హం.

# ఉత్తమ్ బీఆర్ఎస్ కోవర్టు



### కల్వకుంట్ల కుటుంబాన్ని కాపాడేది రేవంతే

### ఫోన్ ట్యాపింగ్ సాక్ష్యాలు మాయం చేసే కుట్ర

### ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన ఆరోపణలు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ కోవర్టు అని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తేనే పట్టణాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు లేకుండా బరిలో నిలిచిన పార్టీ బీజేపీ ఒక్కటే అని అన్నారు.

నిజామాబాద్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): మరీ ముఖ్యంగా ఎప్పటికీ బీఆర్ఎస్‌తో తమకు పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కేసీఆర్ దగ్గర డబ్బులు తీసుకుని ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్ష్యాలను మాయం చేయాలని చూశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ అర్వింద్ ఆరోపణలు చేశారు. కావాలనే కుట్ర పూరితంగా ఎఫ్ఎస్ఎల్‌కు నిప్పు పెట్టారని అన్నారు. మిషన్ కాకతీయ, కాళేశ్వరం కేసుల్లో డబ్బులు తీసుకుని కేసీఆర్ కుటుంబ సభ్యులను తరువాయి 2 వ పేజీలో...

# రికార్డులు భద్రమే

### ‘ఓటుకు నోటు’ కేసు ఆధారాలు కాలిపోలేదు

### డేటాకు నష్టం లేదు.. నిరాధార వార్తలు నమ్మొద్దు

### ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై శిఖా గోయల్

హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో శనివారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో, గతంలో సంచలనం సృష్టించిన ‘ఓటుకు నోటు’, ‘ఫోన్ ట్యాపింగ్’ కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు కాలిపోయాయంటూ సోషల్ మీడియాలో, కొన్ని మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయల్ తీవ్రంగా ఖండించారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): కీలక కేసులకు సంబంధించిన ఆధారాలన్నీ సురక్షితంగా ఉన్నాయని, ఎలాంటి డేటా నష్టం జరగలేదని ఆమె స్పష్టం చేశారు. శనివారం ఉదయం 10:08 గంటల సమయంలో ల్యాబ్ కార్యాలయంలోని సీజ్డ్ ప్రాపర్టీస్ విభాగంలో మంటలు చెలరేగాయి. అక్కడి సిబ్బంది గమనించి వెంటనే అప్రమత్తమైనప్పటికీ, మంటలు వేగంగా ల్యాబ్‌తో పాటు శిక్షణా కేంద్రానికి వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కొన్ని అనాలసిస్ తరువాయి 2 వ పేజీలో...

# బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి?

## మాజీమంత్రికి కేసీఆర్ ఫోన్!

### కరీంనగర్‌లో కేటీఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ?.. రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ

జగిత్యాల/హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరుతున్నారనే వార్తలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఫిబ్రవరి 11న జరగనున్న మున్సి పల్ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లా రాజకీయాలు ఒక్క సారిగా వేడెక్కాయి. ఈ నేపథ్యంలోనే





## రెండ్రోజులు వైన్స్, బార్లు బంద్

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలోని అన్ని మున్సిపాలిటీలలో రెండు రోజుల పాటు వైన్సులు, బార్లు బంద్ కానున్నాయి. ఈనెల 9వ తేదీ నుంచి సాయంత్రం -2 వ పేజీలో...

# రేవంత్ చెప్పుల దొంగ!



## అలాంటి వ్యక్తికి నిధులిస్తారా?

### నా వల్లే కేసీఆర్‌కు బీపీ, షుగర్.. కేంద్ర మంత్రి బండి సంజయ్

సీఎం రేవంత్ తెలంగాణ పాలిటి భస్మాసుర హస్తంగా మారారన్నారు. ఢిల్లీకిపోయి తనను చెప్పుల దొంగగా చూస్తున్నారని అన్నాడని, ఇలాంటివారికి నిధువు ఎవరిస్తారని మండిపడ్డారు. బీజేపీని గెలిపించుకుంటే భారీగా నిధులు వచ్చేలా చూస్తానన్నారు. చొప్పదండిని ఒకరోల్ మోడల్‌లా డెవలప్ చేసే బాధ్యతతనదన్నారు.

కరీంనగర్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): ఇక బీఆర్ఎస్ ది నా ఘర్ కా.. నా ఘట్ కా అంటూ సెటైర్లు వేశారు. వచ్చేది తమప్రభుత్వమే అంటున్నారని, అసలు బీఆర్ఎస్ గత పదేళ్లలో ఏంచేసిందన్నారు. కాంగ్రెస్ ను గెలిపిస్తే కరెంట్ బిల్లులు, నల్లా బిల్లులు పెంచుతారన్నారు. కరీంనగర్లోని చొప్పదండిలో మాట్లాడిన ఆయన తాను.. అబద్ధాలు చెప్పనని, ఉన్నది ఉన్నట్టు మాట్లాడతానని అందుకే తనకి ఇప్పటివరకు బీపీ,షుగర్ అంటే ఎటువంటి రోగాలు - 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

9.2.2026

మేషం: ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు అధిగమించి ముందుకు సాగుతారు. భూ సంబంధిత క్రయవిక్రయాలలో లాభాలు అందుకుంటారు. ఆర్థికంగా పురోగతి కలిగి అవసరానికి ధనసహాయం అందుతుంది. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమకు తగిన ఫలితం పొందుతారు. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

వృషభం: బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఇంటాబయట వ్యవహారాలు కలిసివస్తాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. వృత్తి ఉద్యోగాలలో అధికారులు ఆదరణ పెరుగుతుంది. కొన్ని విషయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకోవడం మంచిది. వాహన ప్రయాణాలలో జాగ్రత్త వహించాలి.

మిధునం: ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా ఉంటాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం కలుగుతుంది. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

కర్కాటకం: సన్నిహితుల నుండి వివాదాలకు సంబంధించి కీలక సమాచారం అందుతుంది. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తవుతాయి. ఆదాయం పెరుగుతుంది. వృత్తి వ్యాపారాల విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యార్థులకు నూతన అవకాశాలు లభిస్తాయి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగ వాతావరణం సంతృప్తికరంగా ఉంటుంది.

సింహం: ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. చుట్టుపక్కల వారితో అప్రమత్తంగా వ్యవహరించాలి. కుటుంబ సమస్యలు పరిష్కరించుకుంటారు. సన్నిహితులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థికంగా కొంత పురోగతి సాధిస్తారు. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

కన్య: సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుకుంటారు. ఆరోగ్య విషయాలలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తవుతాయి. కొన్ని వ్యవహారాలలో మిత్రుల నుండి కీలక సమాచారం అందుతుంది. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి వలన మానసిక ప్రశాంతత ఉండదు.

తుల: ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరానికి ధనం అందుతుంది. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. నూతన వ్యాపార ప్రారంభానికి మిత్రుల సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి వ్యాపారాల్లో సమస్యలను అధిగమించి లాభాలను అందుకుంటారు. నిరుద్యోగులకు ఒక వార్త ఆనందం కలిగిస్తుంది.

వృశ్చికం: ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. దూరప్రాంతాల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చిన్ననాటి మిత్రులు కలిసి కొన్ని విషయాలు చర్చిస్తారు. నూతన కార్యక్రమాలను ప్రారంభానికి శ్రీకారం చుడతారు. కీలక వ్యవహారాల్లో సొంత ఆలోచనలు చేయడం మంచిది. ఉద్యోగస్తులు అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు.

ధనస్సు: బంధుమిత్రుల నుండి ఆశించిన సహాయం అందుతుంది. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక ఋణాలు ఒత్తిడి కొంతవరకు తొలగుతుంది. విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపార వ్యవహారాల్లో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారు. ఉద్యోగమున అధికారుల నుండి ఒత్తిడి పెరుగుతుంది.

మకరం: మానసికంగా ప్రశాంతంగా ఉంటారు వృత్తి వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తి చేస్తారు.సోదరుల సహాయంతో కుటుంబ సమస్యలు పరిష్కరించుకుంటారు. సంతాన వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభం పొందుతారు. వృత్తి ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది.

కుంభం: మిత్రులతో వివాదాలను రాజీ చేసుకుంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడి ఋణాలు తీర్చగలుగుతారు. ముఖ్యమైన వ్యవహారాల్లో ఆలోచించి నిర్ణయం తీసుకోవడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోకపోవడం మంచిది. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. దైవ చింతన పెరుగుతుంది.

మీనం: అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందుతారు. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి కలుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి అవుతాయి. కుటుంబ సభ్యులతో గృహమున ఆనందంగా గడుపుతారు. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో మీ పని తీరుతో అందరినీ ఆకట్టుకుంటారు. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి.

# జిల్లాలను రద్దు చేయం

మొదటి పేజీ తరువాయి



ఊహాగానాలకు సీఎం ఈ సందర్భంగా తెరదించారు. పరిపాలన సౌలభ్యం కోసం భవిష్యత్తులో ఏవైనా మార్పులు చేయాల్సి వస్తే, అది ఏకపక్షంగా జరగదని వివరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో అసెంబ్లీలో సమగ్ర చర్చ జరిపాకే ముందడుగు వేస్తామని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల సూచనలు, సలహాలు స్వీకరించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా శాస్త్రీయంగా నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు. అప్పటి వరకు అనవసరమైన ఆందోళనలు, అపోహలు నమ్మవద్దని భూపాలపల్లి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. భూపాలపల్లి ప్రాంతం పారిశ్రామికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాల అమలులో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

### ఏప్రిల్ తర్వాత రెండో విడత ఇండ్లు

ఇందిరమ్మ ఇండ్ల ఆశావహులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. 2026, ఏప్రిల్ తర్వాత రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ప్రకటించారు. తొలి విడతలో భాగంగా నాలుగన్నర లక్షలు ఇండ్లు కట్టించామని తెలిపారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు 25 లక్షల ఇండ్లు ఇచ్చామని గుర్తు చేశారు. కానీ ఇందిరమ్మ ఇండ్లపై కేసీఆర్ తప్పుడు ప్రచారం చేశారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని పేదలకు ఆశ చూపారు.. కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చాక కేసీఆర్ ఫ్యామిలీకి ఫాంహౌస్□లు వచ్చాయి కానీ పేదలకు ఇండ్లు రాలేదని విమర్శించారు.కేసీఆర్ కుటుంబానికి టీవీలు, పేపర్లు, వ్యాపారాలు వచ్చాయి కానీ పోరాడి తెచ్చుకున్న రాష్ట్రంలో పేదలకు ఏమి రాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అందరికీ ఇండ్లు ఉండాలనే సదుద్దేశంతో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని.. పైసా లంచం లేకుండా నేడు పేదలు ఇండ్లు కట్టుకుంటున్నారన్నారు. అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ గెలవాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి బీజేపీ, బీఆర్ఎస్□కు సిగ్గుండాలని అన్నారు. కేసీఆర్, మోడీని చూసి ఓటేస్తే మోసపోతాం.. గోస పడ్తామని పేర్కొన్నారు.టెలిఫోన్ ట్యాపింగ్ ద్వారా భార్యభర్తలు మాట్లాడుకున్న మాటలు విన్న దుర్మార్గులు బీఆర్ఎస్ పాలకులు అని సీఎం దుయ్యబట్టారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా తమ భూములు కొనుగోలు చేసిన వారిని బ్లాక్ మెయిల్ చేసి బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్లు వసూలు చేశారని, బీఆర్ఎస్ అకౌంట్లో ఉన్న 15 వందల కోట్ల రూపాయలు ఎవరి అబ్బ సొమ్ము అని ప్రశ్నించారు. టెలిఫోన్ ట్యాపింగ్ ద్వారా బ్లాక్ మెయిల్ చేసి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన బీఆర్ఎస్‌ను 'బ్లాక్ మెయిల్ రాజకీయ సమితి' గా నామకరణం చేస్తున్నానన్నారు. చేసిన పాపాలు ఊరికే పోవని ఆ పాపాల ఊబిలోనే బీఆర్ఎస్ కూరుకుపోతుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు వేరు వేరు కాదని అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దెబ్బకు దెబ్బ, ఎత్తుకు పై ఎత్తు వేద్దామని బీజేపీ, బీఆర్ఎస్, కేసీఆర్, మోదీ, అమిత్ షానే కాదు మీ తాతలు ముత్తాతలు తీసుకొచ్చినా మా కాంగ్రెస్ కార్యకర్తలు వారి సంగతి తేలుస్తారన్నారు. ఇక, కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు అరెస్టు కాకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాపాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. వీరిని అరెస్టు చేయమంటే ఈ రాష్ట్రానికి నేనేమైనా ముఖ్యమంత్రినా అని కిషన్ రెడ్డి మాట్లాడుతూన్నారు.. మరి తెలంగాణను ఇచ్చిన ఆడబిడ్డ సోనియా గాంధీని, ఈ దేశంకోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబాన్ని క్షోభకు గురి చేస్తున్న ఈడీ, సీబీఐ మీది, మీ మోడీది కాదా? అని సీఎం ప్రశ్నించారు. కాళేశ్వరం కేసును సీబీఐకి, ఫార్ములా కేసును ఈడీకి పంపి చాలా నెలలవుతున్నా ఇప్పటి వరకు ఎందుకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్□రావును కనీసం విచారణకు పిలవడం లేదని నిలదీశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావును అరెస్టు చేసే వరకు కిషన్ రెడ్డి పేరును 'కల్వకుంట్ల కిషన్ రావు'గా పిలుస్తానన్నారు. కేసీఆర్□కు కేటీఆర్ దొంగపుత్రుడైతే కిషన్ రెడ్డి దత్తపుత్రుడని విమర్శించారు.

# ల్యాబ్ ధ్వంసానికి..రేవంత్ కుట్ర

మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యేలను కొనడానికి వచ్చి రూ.50లక్షల బ్యాగుతో కెమెరాల ముందు దొరికాడని గుర్తుచేశారు. ఈ కేసు నుంచి బయటపడటానికే రేవంత్ రెడ్డి కుట్ర చేశాడని అన్నారు. ఓటుకు నోటు కేసు విచారణ న్యాయస్థానంలో తుది దశకు వచ్చిందని తెలిపారు. చివరి దశలో ఆధారాలు మాయం చేయడానికి పన్నిన కుట్ర అని అనుమానం వ్యక్తం చేశారు. దొంగతనం చేసి దొరికిపోవడం రేవంత్ రెడ్డికి అలవాటే అని కేటీఆర్ విమర్శించారు. అగ్ని ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయి? చలికాలంలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరుగుతాయా అని ఆయన నిలదీశారు. చలికాలం పొద్దున 10 గంటలకు అగ్ని ప్రమాదం జరిగిందట.. రేవంత్ రెడ్డి చెప్పే మాటలు మనం నమ్మాలా అని ప్రశ్నించారు. ఇది చేయించబడిన అగ్ని ప్రమాదం అని అన్నారు. తన క్రిమినల్ మనస్తత్వంతో రేవంత్ రెడ్డినే ల్యాబ్‌ను తగులబెట్టించాడని తెలిపారు. నేరాల విచారణలో ఫోరెన్సిక్ కీలక విభాగమని కేటీఆర్ తెలిపారు. వేలాది కేసుల వివరాలు అగ్గికి బుగ్గి అయ్యాయని పేర్కొన్నారు. ఎంతోమంది క్రిమినల్స్ తప్పించుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టీజీఎఫ్ఎస్ఎల్ ప్రకటన తూతూ మంత్రంగా ఉందని తెలిపారు. ఏం నష్టం జరగలేదంటూ డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఒక ఇన్‌స్పెక్టర్ నిజాయితీగా పనిచేశాడని చెప్పారు. ఉదయం 10 గంటలకు అగ్ని ప్రమాదం జరిగినట్లు ఎఫ్ఐఆర్‌లో స్పష్టంగా రాశారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల దాకా మంటలు అదుపు చేయలేదని.. బుడ్డ బిల్డింగ్‌లో మంటలు ఆర్పడానికి మూడు గంటలు పట్టిందా అని ప్రశ్నించారు. సాక్ష్యాలన్నీ మాయం చేయడానికి పోలీసులు సహకరించారని అన్నారు. మూడు అంతస్తుల భవనంలో మంటలు ఆర్పడానికి మూడు గంటలు పడుతుందంటే నమ్మాలా అని ప్రశ్నించారు. మొదటి అంతస్తులో మంటలు ఆర్పడానికే మూడు గంటలా అని నిలదీశారు.

### మీడియాను మేనేజ్ చేశారు

ముఖ్యమైన కేసుల సమాచారం అంతా మొదటి అంతస్తులోనే ఉందని కేటీఆర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ఎవరూ డ్యూటీలో లేరట.. మీడియాను మేనేజ్ చేసి తిమ్మిని బమ్మి చేశారని మండిపడ్డారు. ఏం జరగలేదని తప్పు అని ఒక ఇన్‌స్పెక్టర్ చెప్పారని తెలిపారు. సర్వర్ రూమ్ కూడా కాలిపోయిందని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారని చెప్పారు. సర్వర్‌లు కాలబెట్టినంక ఇంకేం ఉంటుందని కేటీఆర్ ప్రశ్నించారు. కుట్ర విజయవంతంగా పూర్తిచేశారని అన్నారు. 50 కంప్యూటర్లు తగలబడ్డాయని చెబుతున్నారని తెలిపారు. ఒక ప్రభుత్వం తమ ప్రభుత్వ కార్యాలయాన్ని తామే కాల్చిపారేయడం దేశంలో ఎక్కడా జరగదని విమర్శించారు. దొంగ, చీకటి ఏకమయ్యాయని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రే దొంగ అని అన్నారు. కేంద్రంతో రేవంత్ రెడ్డి ఇన్ని రోజులు మేనేజ్ చేసుకున్నాడని తెలిపారు. అమిత్ షా కాళ్లు పట్టుకుని అడుక్కున్నాడని పేర్కొన్నారు. చివరకు సాక్ష్యాధారాలను మాయం చేసే డెడ్లీ కుట్ర చేసిందని అన్నారు. ఇందులో కుట్రను కేంద్రం నిగ్గుతేల్చాలని కోరారు. రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇది కుట్రపూరితంగా జరిగిందే.. ప్రమాదం కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వేల కేసుల ఆధారాలు బుగ్గి చేశారని కేటీఆర్ మండిపడ్డారు. నేరగాళ్లు, రేపిస్టులు, దుర్మార్గులకు శిక్ష పడే అవకాశం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మేం సైంటిస్టులను తీసుకొని వస్తం.. మమ్మల్ని రానివ్వండి అని కోరారు. సీఎం రేవంత్ రెడ్డితో లాలూచీ లేకపోతే.. కేంద్రం ఎంక్వైరీ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ వచ్చి ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని అంటాడని.. బడే భాయ్, ఛోటే భాయ్ బంధం లేకపోతే వెంటనే విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కుంభకోణాన్ని మేం బయటపెట్టినం.. సీఎం బామ్మర్ది పాత్ర ఉందని బయటపెట్టినం.. కానీ కేంద్రం విచారణ జరపడం లేదని తెలిపారు. దారుణ నేరానికి ఒడిగట్టిన నేరగాడిని బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

### కాంగ్రెస్‌ది భస్మాసుర హస్తం

ఉద్యోగాల పేరుతో యువతను కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఆయన స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరులో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందిరా చౌక్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజల్ని మోసం చేశారని మండిపడ్డారు.వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని రేవంత్ ప్రగల్భాలు పలికారని చెప్పారు. రేవంత్ పాలనలో యూరియా కష్టాలు తప్పడం లేదని అన్నారు. చెప్పులు క్యూలైన్లలో పెట్టి ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడూ యూరియా కొరత లేదని మండిపడ్డారు. రైతుబంధు అడిగితే.. లాగులో తొండలు విడుస్తానని అంటున్నాడని విమర్శించారు. రెండున్నరేళ్లుగా సంక్షేమాభివృద్ధి లేక ప్రజలు గోసపడుతున్నారని తెలిపారు.

# రేవంత్ చెప్పుల దొంగ!

మొదటి పేజీ తరువాయి

రాలేదని పేర్కొన్నారు. తాను గట్టిగా పోరాడటం కారణంగానే కెసిఆర్ కు బీపి, షుగర్ వచ్చాయని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు ప్రజలు మాయ మాటలు నమ్మొద్దు అని, బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే ఢిల్లీ నుంచి నిధులు తీసుకువస్తానని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు చొప్పదండిసహా మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆ నిధులను తీసుకొచ్చి తాము అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీకి ఓటేయాల్సిన అవసరం లేదన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, ఎన్నికలొస్తున్నాయని తెలిసినా నిధులు విడుదల చేయలేదని బండి సంజయ్ ఆరోపించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500, తులం బంగారం, స్కూటీ, అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్, నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాలు వంటి హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కనిపిస్తోందంటే అది పూర్తిగా కేంద్ర నిధుల వల్లేనని సంజయ్ తెలిపారు. చొప్పదండిలో అమృత్-2 పథకం ద్వారా రూ.36.30 కోట్లు, 14,15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.5.57 కోట్లు, స్వచ్ఛ భారత్ పథకం ద్వారా రూ.42.66 లక్షలు కేంద్రం మంజూరు చేసిందన్నారు. స్వనిధి పథకం ద్వారా 1,611 మందికి రూ.2.94 కోట్ల రుణాలు అందాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లు అందించడంతో పాటు పరీక్ష ఫీజును తానే చెల్లించానని కేంద్ర మంత్రి బండి సంజయ్ గుర్తు చేశారు. చొప్పదండి మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఆగి పోయిన మార్కెట్ నిర్మాణం పూర్తి చేస్తామని, ఇంటింటికీ తాగునీరు, కొత్త రోడ్లు, డ్రైనేజీలు, చెరువుల అభివృద్ధి, కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రి అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రజల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో.. ఆలోచించి ఓటేయాలని కోరారు.

# బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి?

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా జీవన్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారని సమాచారం. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న అవమానాల దృష్ట్యా, పార్టీలోకి రావాలని ఆయనను ఆహ్వానించినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇదే తరుణంలో, జీవన్ రెడ్డి కరీంనగర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసినట్లు వార్తలు వస్తున్నాయి. జగిత్యాల మున్సిపల్ టికెట్ల కేటాయింపులో తన అనుచరులకు అన్యాయం జరిగిందని భావిస్తున్న జీవన్ రెడ్డి, కేటీఆర్‌తో భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు తెలుస్తోంది.

### కాంగ్రెస్ నాయకత్వంపై జీవన్ రెడ్డి ఆగ్రహం

జగిత్యాల మున్సిపాలిటీలో తన వర్గానికి కాకుండా, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచరులకే ఎక్కువ టికెట్లు కేటాయించారని జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల ఒక ప్రచారంలో ఆయన కన్నీరు పెట్టుకోవడం, కాంగ్రెస్ నాయకత్వం తనను క్రమబద్ధంగా పక్కన పెడుతోందని ఆరోపించడం గమనార్హం. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా, జగిత్యాలలో ఒక స్వతంత్ర అభ్యర్థికి మద్దతుగా జీవన్ రెడ్డి ప్రచారం చేస్తూ కాంగ్రెస్ అధిష్టానానికి షాక్ ఇచ్చారు. ప్రస్తుతానికి జీవన్ రెడ్డి అధికారికంగా పార్టీ మార్పును ప్రకటించనప్పటికీ, బీఆర్ఎస్ ముఖ్యనేతలతో ఆయన టచ్‌లో ఉన్నారని, కాంగ్రెస్‌పై ఆయన చేస్తున్న తిరుగుబాటును బట్టి ఆయన త్వరలోనే గులాబీ తీర్థం పుచ్చుకునే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఉత్తమ్ బీఆర్ఎస్ కోవర్టు

మొదటి పేజీ తరువాయి

జైలు పంపడం లేదని అనుమానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏండ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెవిలో ఊదగానే నిజామాబాద్ గడ్డపై నోరు విప్పిన సీఎం రేవంత్‌రెడ్డి తన అవగాహనలేమిని మరోసారి చాటుకున్నారని ఎద్దేవా చేశారు. దేశంలోని ప్రతి రాష్ట్రం నుంచి స్మార్ట్ సిటీ ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారానే కేంద్రానికి చేరుతాయని, అది ఎంపీలు చేసే పని కాదన్నారు. నిజామాబాద్‌కు అమృత్ స్కీమ్ తీసుకొచ్చి రూ.400 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించానని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీకి ఫెవికాల్ బంధం ఉందన్నారు. కల్వకుంట్ల కుటుంబాన్ని కాపాడే వ్యక్తి సీఎంగా ఉండటానికి అనర్హుడన్నారు. కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ స్కీమ్‌ల కింద మరో రూ.50 వేల కోట్లు దోచుకున్న కేసీఆర్‌ను, ఈకార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో ఉన్న కేటీఆర్‌ను ఎందుకు జైలుకు పంపడం లేదని ప్రశ్నించారు. ప్యాకేజీలు తీసుకుని వ్యక్తిత్వాన్ని అమ్ముకునే సీఎం రాష్ట్రాన్ని నడపడం బాధాకరమన్నారు. జిల్లాలో ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డితో కలిసి కరప్షన్‌కు దూరంగా పని చేస్తున్నామన్నారు. మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ 11న జరిగే పోలింగ్‌తో గేమ్ చేంజ్ చేస్తామన్న వ్యాఖ్యలు దేనికి సంకేతమో చెప్పాలని ప్రశ్నించారు. నిజామాబాద్ నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దాలంటే బీజేపీని గెలిపించాలని విన్నవించారు.

# రికార్డులు భద్రమే

మొదటి పేజీ తరువాయి

డాక్యుమెంట్ ఫైళ్లు మాత్రమే దగ్ధమయ్యాయని, వాటిని కూడా రికవరీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని శిఖా గోయల్ వివరించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. ముఖ్యంగా, తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు రేపిన 2015 నాటి 'ఓటుకు నోటు' కేసుకు సంబంధించిన ఆధారాలు ధ్వంసమయ్యాయని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆమె తేల్చిచెప్పారు. ఆ కేసుకు సంబంధించిన 16 మెటీరియల్ ఆబ్జెక్టులను 2015లోనే స్వీకరించి, పరీక్షించిన తర్వాత 2021 మార్చిలోనే ఏసీబీ కోర్టుకు తిరిగి సమర్పించామని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు ఈ కేసుకు సంబంధించిన ఒక్క ఆధారం కూడా ఎఫ్ఎస్ఎల్‌లో లేదని ఆమె తెలిపారు. అదేవిధంగా, ఇటీవలి ఫోన్ ట్యాపింగ్ కేసుకు (పంజాగుట్ట పీఎస్ క్రైమ్ నెం. 243/2024) సంబంధించి మార్చి 2024 నుంచి జనవరి 2026 మధ్య అందిన 132 మెటీరియల్ ఆబ్జెక్టులను పూర్తిగా పరిశీలించామని, వాటన్నింటినీ సురక్షితంగా వెలికితీశామని గోయల్ చెప్పారు. వాటి నివేదికలు ఇప్పటికే కొన్ని కోర్టుకు సమర్పించగా, మరికొన్ని సిద్ధమవుతున్నాయని అన్నారు. ఒకవేళ ఏవైనా డాక్యుమెంట్లు కాలిపోయినా, వాటి డేటాను తిరిగి పొందే సాంకేతిక సామర్థ్యం తమ బృందానికి ఉందని, ఆధారాల భద్రత విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. ల్యాబ్‌లో కాలిపోయినవి ఇప్పటికే కోర్టులకు సమర్పించిన డాక్యుమెంట్ల కాపీలేనని, ఒరిజినల్స్ కోర్టు వద్ద భద్రంగా ఉంటాయని ఆమె పునరుద్ఘాటించారు. ఈ అగ్నిప్రమాదంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# రెండ్రోజులు వైన్స్, బార్లు బంద్

మొదటి పేజీ తరువాయి

5 గంటల నుంచి 11 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని ఎన్నికల, అబ్కారీ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా 13వ తేదీ వరకు ఫలితాల నేపథ్యంలో వైన్స్, బార్లు బంద్ చేయాలని పేర్కొన్నారు.

# రైతు భరోసా కోసం 9 వేల కోట్ల అప్పు

## కోసం ప్రభుత్వ కసరత్తు.. 10న నిధుల సమీకరణకు ప్లాన్



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): తెలంగాణ రైతులకు యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను అందించేందుకు ప్రభుత్వం భారీ కసరత్తు ప్రారంభించింది. నిధుల సమీకరణ కోసం బహిరంగ మార్కెట్ నుంచి ఏకంగా రూ.9,000 కోట్లు రుణం తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు (ఆర్బీఐ) ఇండెంట్ సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రుణం సేకరించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ నెల 10వ తేదీన ఆర్బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సమీకరించనున్నారు. 13 ఏళ్ల కాలపరిమితితో రూ.2,000 కోట్లు, 16 ఏళ్లకు మరో రూ.2,000 కోట్లు, 21 ఏళ్ల కాలపరిమితితో రూ.2,500 కోట్లు, 27 ఏళ్లకు రూ.2,500 కోట్ల చొప్పున ప్రభుత్వం రుణం తీసుకోనుంది. ఈ-వేలం ప్రక్రియ పూర్తయిన తర్వాత నిధులు ప్రభుత్వ ఖజానాకు చేరతాయి. అనంతరం రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను ప్రారంభించే అవకాశముంది. ఇప్పటికే యాసంగి సీజన్‌కు సంబంధించి అర్హులైన రైతుల జాబితా కూడా సిద్ధమైనట్లు సమాచారం. అయితే, ఈ నిధుల విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలే ఒక స్పష్టత ఇచ్చారు. మిర్యాలగూడలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన వెంటనే రైతు భరోసా నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. దీంతో నిధుల సమీకరణ ప్రక్రియ పూర్తయినా, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. తమ ప్రభుత్వం పార్టీలకతీతంగా, ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని సీఎం తెలిపారు. ఇప్పటికే పంట రుణాల మాఫీ కింద రైతులకు రూ.21 వేల కోట్లు అందించామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ కూడా ఇచ్చామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.



## వంద కోట్ల భూమిని కాపాడిన హైడ్రా

అమీన్‌పూర్/హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): హైదరాబాద్ లోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా అధికారులు తాజాగా వంద కోట్ల విలువైన నాలుగు ఎకరాల స్థలాన్ని కాపాడారు. ఆక్రమణలు కూల్చివేసి కబ్జాదారుల చెర నుంచి విలువైన భూమిని విడిపించారు. అమీన్ పూర్ లోని చక్రపురి లేఔట్ లో రోడ్లు, పార్కు స్థలం కబ్జాకు గురైందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ఈరోజు ఉదయం బుల్డోజర్లతో అమీన్ పూర్ చేరుకున్న అధికారులు.. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టిన నిర్మాణాలను కూల్చివేశారు. పోలీస్ సిబ్బంది బందోబస్తుతో రెవెన్యూ అధికారుల సమక్షంలో హైడ్రా అధికారులు మొత్తం 15 జేసీబీలతో ఆక్రమణలు తొలగించారు. దీంతో పాటు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దూలపల్లి విలేజ్‌లోని సుమారుకుంటలో, నాగారం రామకృష్ణ నగర్ కాలనీ లోని శివాలయానికి చెందిన 1,365 గజాల స్థలాన్ని, యూసుఫ్గూడలో మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా కాపాడింది.

**కులాంతర వివాహం..**

## అల్లుడి ఇంటిని దగ్ధం చేసిన మామ

మంచిర్యాల, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): కూతురు తమకు ఇష్టం లేని కులాంతర వివాహం చేసుకుందనే కోపంతో ఓ తండ్రి అల్లుడి ఇంటికి నిప్పుపెట్టిన దారుణ సంఘటన మంచిర్యాల జిల్లాలో చోటుచేసుకుంది. భీమారం మండలం దాంపూర్ గ్రామంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాంపూర్ గ్రామానికి చెందిన జంగపెల్లి సురేందర్, అదే గ్రామానికి చెందిన అంజలి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల వారు వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న అంజలి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. సురేందర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో అక్కడికి వెళ్లి, ఇంటికి తాళం వేసి ఉండటంతో పెట్రోల్ పోసి నిప్పంటించారు. మంటలను వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు అంజలి కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ వెంకటేశ్వర్, ఎస్ఐ రాజేందర్ వెల్లడించారు.

# శంకరాచార్య మఠాలను స్థాపించలేదు

### చినజీయర్ స్వామి వివాదాస్పద వ్యాఖ్యలు



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు) చినజీయర్ స్వామి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేసారు. ఆది శంకరాచార్యులు చతురాంనాయ పీఠాలను (నాలుగు అమనాయ పీఠాలు - శృంగేరి, ద్వారకా, పూరి, జ్యోతిర్మఠ) స్థాపించలేదని సంచలన వ్యాఖ్యలు చేసారు. 32 ఏళ్ల వయసులో శంకరాచార్యులు ఉత్తర భారతదేశానికి వెళ్లిపోయారని, ఆయన తిరిగి వచ్చి మఠాలను స్థాపించినట్టు చరిత్రలో ఎక్కడా లేదని అన్నారు. 13వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్య రాజులు హరిహరరాయులు, బుక్కరాయుల గురువు విద్యారణ్య స్వామి స్థాపించారని పేర్కొన్నారు. అయితే భారతదేశంలో అత్యధిక మంది నమ్మే సాంప్రదాయ ప్రకారం.. ఆది శంకరాచార్యులు (క్రీ.శ. 8వ శతాబ్దం) అద్వైత వేదాంతాన్ని ప్రచారం చేయడానికి ఈ నాలుగు మఠాలను స్థాపించారు. దేశం నలుమూలలలో మఠాలు ఏర్పాటు చేసి, హిందూ ధర్మంలో ఐక్యత తీసుకురావడమే ఆయన లక్ష్యం అని చెబుతారు. ప్రతి మఠానికి ఒక ప్రధాన శిష్యుడిని నియమించి, వేదాలు, ఉపనిషత్తులు, అద్వైత సిద్ధాంతాన్ని బోధించే బాధ్యత అప్పగించారని దశనామి సన్యాస సంప్రదాయం చెబుతుంది. అందుకే ఈ నాలుగు మఠాలు శంకరాచార్యుల వారసత్వానికి చిహ్నాలుగా భావిస్తారు. ఇపుడు వివాదానికి కారణం అయిన చినజీయర్ స్వామి విశిష్టాద్వైత సంప్రదాయానికి చెందినవార. రామానుజాచార్య పరంపరను అనుసరిస్తారు. విశిష్టాద్వైతం, అద్వైతం మధ్య తాత్విక భేదాలు ఉన్న విషయం తెలిసిందే. గతంలో కూడా ఈ రెండు సంప్రదాయాల మధ్య సిద్ధాంతపరమైన వాదనలు జరిగాయి. అందుకే అద్వైత వాదులు, శంకరాచార్య పీఠాల అనుచరులు ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. ఆధునిక పరిశోధనలు, చరిత్రకారుల వాదనలు వేరుగా ఉన్నప్పటికీ.. నాలుగు అమ్నాయ పీఠాలు ఆది శంకరాచార్యులే స్థాపించారు అన్నదే అత్యధికమంది చేత అంగీకరించబడిన విషయం. ఈ అంశంపై భిన్న అభిప్రాయాలు ఉన్నా, ఆది శంకరాచార్యుల పాత్రను తక్కువగా చూపించడం సరైంది కాదని చాలామంది ఆధ్యాత్మిక గురువులు, పండితులు అభిప్రాయపడుతున్నారు. అందుకే చిన్న జీయర్ స్వామి వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర వివాదంగా మారాయి.

# సిద్ధిపేట జిల్లాలో పెద్దపులి కలకలం



సిద్దిపేట, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): తెలంగాణలోని సిద్దిపేట జిల్లాలో ఓ పెద్దపులి సృష్టిస్తున్న భయాందోళనలు కొనసాగుతున్నాయి. వరుసగా పశువులపై దాడి చేస్తూ వాటిని చంపుతుండటంతో స్థానిక గ్రామాల్లో తీవ్ర కలకలం రేగింది. ఈ పులిని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు తమ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. తాజాగా కొహెడ మండలం ఆరెపల్లి గ్రామంలో పులి సంచరించినట్లు కొంతమంది రైతులు చెప్పడంతో గ్రామస్థులు భయంతో వణికిపోతున్నారు. సమీపంలోని చంద్రానాయక్ తండా వద్ద మాలోత్ రమేష్ అనే రైతుకు చెందిన ఐదు దూడలను పులి చంపేసింది. స్థానికుల సమాచారంతో అటవీ, పోలీస్ శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పులి పాదముద్రలను సేకరించారు. పులి సంచరిస్తున్న ప్రదేశాల్లో కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రజలకు కీలక సూచనలు జారీ చేశారు. రైతులు తమ పశువులను పొలాల్లో కాకుండా ఇళ్ల వద్దే సురక్షితంగా కట్టేసుకోవాలని సూచించారు. అలాగే, పొలాలకు ఒంటరిగా వెళ్లవద్దని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ పులి గతంలో జిల్లాలోని ఘనపూర్, అక్కెనపల్లి, బస్వాపురం గ్రామాల్లోనూ పశువులపై దాడి చేసి చంపేసింది. శనివారం జనగామ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో పశువులను చంపిన తర్వాతే ఇది సిద్దిపేట జిల్లాలోకి ప్రవేశించి ఉంటుందని అధికారులు తెలిపారు. పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి ఈ పులి తెలంగాణలోకి వచ్చినట్లు అనుమానిస్తున్నారు. వారం రోజుల వ్యవధిలోనే తెలుగు రాష్ట్రాల్లో ఇది రెండో ఘటన. ఫిబ్రవరి 6న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి సమీపంలో సంచరించిన ఓ పులిని అటవీ అధికారులు విజయవంతంగా పట్టుకున్న విషయం తెలిసిందే.

# ఐవీఎఫ్ ద్వారా గిర్ దూడ జననం

### గుజరాత్‌లో హిస్టరీ

అహ్మదాబాద్ : గుజరాత్ పశుసంవర్ధక రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఇన్-విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) పద్ధతి ద్వారా ఒక స్వచ్ఛమైన గిర్ జాతి దూడ జన్మించింది. అమ్రేలి జిల్లాలోని వరుడిలో ఉన్న గుజరాత్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ బోర్డ్‌కు చెందిన పిండ మార్పిడి ప్రయోగశాలలో ఈ విజయం సాధ్యమైంది. మేలుజాతి పశుసంపదను పెంచి, పాల ఉత్పత్తిని అధికం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రయోగంలో భాగంగా, అత్యుత్తమ జన్యు లక్షణాలున్న గిర్ జాతి ఆవు నుంచి సేకరించిన అండాలతో ప్రయోగశాలలో పిండాన్ని సృష్టించారు. అనంతరం ఆ పిండాన్ని కాంక్రేజ్ జాతికి చెందిన ఒక అద్దె గర్భం (సరోగసీ) దాల్చిన ఆవులోకి ప్రవేశపెట్టారు. తాజాగా ఆ ఆవు ఒక ఆరోగ్యవంతమైన గిర్ దూడకు జన్మనిచ్చింది. ఈ విజయంపై రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి జీతూ వాఘాని హర్షం వ్యక్తం చేశారు. "గతేడాది నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) సాంకేతిక సహకారంతో ఈ ఐవీఎఫ్ కార్యక్రమాన్ని ప్రారంభించాం. తొలిదశలో 13 జంతువులపై పిండ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించాం. తాజాగా కాంక్రేజ్ జాతికి చెందిన అద్దె తల్లి ద్వారా స్వచ్ఛమైన గిర్ దూడ జన్మించింది. దాత ఆవుకున్న మేలుజాతి లక్షణాలన్నీ ఈ దూడకు సంక్రమిస్తాయి" అని ఆయన వివరించారు. సాధారణంగా ఒక ఆవు తన జీవితకాలంలో ఏడెనిమిది దూడలకు మాత్రమే జన్మనివ్వగలదు. కానీ ఐవీఎఫ్ టెక్నాలజీతో, మేలుజాతి లక్షణాలున్న ఒకే ఆవు ద్వారా 100కు పైగా దూడలను సృష్టించే అవకాశం ఉంటుంది. రానున్న రోజుల్లో మరో 30కి పైగా జంతువులకు పిండ మార్పిడి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ విజయంతో గుజరాత్, పశువుల కోసం అభివృద్ధి చేసిన పునరుత్పత్తి సాంకేతికతలో దేశంలోనే ముందు వరుసలో ఉంది.






# ఓఆర్ఆర్‌పై టోల్ బాదుడు

### ఏప్రిల్ 1 నుంచి కొత్త చార్జీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రయాణికులకు ముఖ్య గమనిక. ఏప్రిల్ 1 నుంచి ఓఆర్ఆర్‌పై ఉన్న అన్ని టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేయనున్నారు. ఇకపై ఫాస్టాగ్ లేదా యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా మాత్రమే టోల్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. జాతీయ రహదారులపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న క్యాష్‌లెస్ విధానాన్ని అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఫాస్టాగ్ ఉన్న వాహనాలు ఆటోమేటిక్‌గా స్కాన్ అవుతుండగా, ఫాస్టాగ్ లేనివారు నగదు చెల్లించే అవకాశం ఉంది. ఏప్రిల్ 1 నుంచి ఈ నగదు విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నారు. అలాంటి వారు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చెల్లింపులు చేయవచ్చు. ఓఆర్ఆర్‌పై పెద్ద అంబర్‌పేట్, మేడ్చల్, కోకాపేట, శంషాబాద్‌తో సహా మొత్తం 19 ఇంటర్‌చేంజ్ టోల్ ప్లాజాలను హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) నిర్వహిస్తోంది. నగదు నిర్వహణ, రవాణా, భద్రపరచడం వంటి సమస్యలతో పాటు చిల్లర విషయంలో ప్రయాణికులకు, సిబ్బందికి మధ్య తరచూ వాగ్వాదాలు జరుగుతున్నాయని హెచ్‌జీసీఎల్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. రికార్డుల నిర్వహణలో పారదర్శకత లోపించడం, దొంగతనాల వంటి భద్రతాపరమైన సమస్యలను అధిగమించేం దుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. మరోవైపు ఓఆర్ఆర్‌పై టోల్ చార్జీలను కూడా 2026 ఏప్రిల్ 1 నుంచి పెంచే అవకాశం ఉంది. చివరి సారిగా 2024 ఏప్రిల్‌లో టోల్ రేట్లను సవరించారు. వివిధ కారణాల వల్ల 2025 ఏప్రిల్‌లో పెంపును చేపట్టలేదు. దీంతో రెండేళ్ల విరామం తర్వాత సవరించిన టోల్ రేట్లు అమల్లోకి రానున్నాయని అధికారులు తెలిపారు. దీనిపై తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది.



## 28న నింగిలోకి 'రుద్రమ' రాకెట్

### వరంగల్ చరిత్రలో తొలిసారి

వరంగల్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): వరంగల్ చరిత్రలో తొలిసారిగా ఒక మోడల్ రాకెట్‌ను ప్రయోగించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇస్రో స్పేస్ ట్యూటర్, ఏటీడీఆర్ఎల్ (అనిసియంట్ టెక్నాలజీస్ డిజైన్ అండ్ రీసెర్చ్ ల్యాబ్) వ్యవస్థాపకుడు శశాంక్ భూపతి నేతృత్వంలో ఈ ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వరంగల్ నిట్, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్నాయి. 'రుద్రమ' అని నామకరణం చేసిన ఈ మోడల్ రాకెట్‌ను ప్రయోగించడానికి ముందు, హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్‌లో సైన్స్, అంతరిక్షంపై అవగాహన సదస్సు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 28న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదస్సు కొనసాగుతుంది. అనంతరం రాకెట్‌ను నింగిలోకి పంపిస్తారు. దీంతో పాటు, అంతరిక్ష వీక్షణపై ఆసక్తిని పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ నెల 15 నుంచి 27 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు భద్రకాళి ట్యాంక్‌బండ్‌పై టెలిస్కోపులతో నక్షత్ర వీక్షణ (స్టార్ గేజింగ్) కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు స్కూల్, కాలేజీ విద్యార్థులకు, ఆసక్తిగల వారికి ప్రవేశం ఉచితమని శశాంక్ తెలిపారు.

## టీజీఎస్పీఎఫ్‌కూ పోలీస్ శాలరీ

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర భద్రతా సిబ్బందికి సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని వివిధ సంస్థలకు భద్రత కల్పిస్తున్న తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం (టీజీఎస్పీఎఫ్) సిబ్బందికి కూడా పోలీసు శాలరీ ప్యాకేజీని అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. సికింద్రాబాద్ రాణిగంజ్‌లోని బుద్ధ భవన్‌లో శనివారం టీజీఎస్పీఎఫ్, ఎస్బీఐ మధ్య ఈ మేరకు అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం టీజీఎస్పీఎఫ్ సిబ్బంది ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి వ్యక్తిగత ప్రమాద బీమా కింద రూ. కోటి అందుతుంది. అదే విమాన ప్రమాదంలో మరణిస్తే రూ. కోటీ 60 లక్షలు చెల్లిస్తారు. విధి నిర్వహణలో శాశ్వత వైకల్యం సంభవిస్తే రూ. 80 లక్షల వరకు పరిహారం అందిస్తారు. విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది పిల్లల ఉన్నత విద్య కోసం రూ. 28 లక్షల వరకు, ఇద్దరు కుమార్తెల వివాహాల కోసం రూ. 10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తారు. వీటితో పాటు రూ. 10 లక్షల గ్రూప్ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా ఉంటుంది. కాలిన గాయాల కేసుల్లో ప్లాస్టిక్ సర్జరీకి గరిష్ఠంగా రూ. 10 లక్షలు, అంబులెన్స్ ఖర్చులకు రూ. 50 వేలు, ఎయిర్ అంబులెన్స్ కోసం రూ. 10 లక్షల వరకు చెల్లిస్తారు. ఈ ఒప్పందం ద్వారా సిబ్బందికి పలు రుణ సౌకర్యాలు, లాకర్ అద్దెపై రాయితీలు, ప్లాటినం రూపే డెబిట్ కార్డు వంటి అదనపు ప్రయోజనాలు కూడా లభించనున్నాయి.



## 4 రోజుల్లో 10.71 కోట్లు

మేడారం/హనుమకొండ, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): సమ్మక్క-సారక్క జాతర సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల హుండీల లెక్కింపు నాలుగు రోజుల్లో రూ.10.71 కోట్ల ఆదాయం సమకూరింది. జాతరకు సంబంధించి మొత్తం 828 హుండీలు ఏర్పాటు చేయగా, అందులో 780 ఇనుప హుండీలు, 45 వస్త్ర హుండీలు, 3 బియ్యం హుండీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నాల్గో రోజు భాగంగా 200 హుండీలను తెరిచి లెక్కించగా, వాటి ద్వారా రూ.2,64,75,757/- ఆదాయం లభించినట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 5న 125 హుండీల లెక్కింపులో రూ.2,49,65,000, ఫిబ్రవరి 6న 160 హుండీల లెక్కింపులో రూ.3,54,25,200తో పాటు విదేశీ కరెన్సీ మార్పిడి ద్వారా రూ.63,436, ఫిబ్రవరి 7న 140 హుండీల లెక్కింపులో రూ.2,01,21,440తో పాటు విదేశీ కరెన్సీ మార్పిడి ద్వారా రూ.71,283/- ఆదాయం లభించింది. నాలుగు రోజుల వ్యవధిలో మొత్తం 625 హుండీలను లెక్కించగా, కలిపి రూ.10,71,22,116 ఆదాయం సమకూరినట్లు ఈవో స్పష్టం చేశారు.

## 17 నుంచి జూబ్లీహిల్స్ వెంకన్న బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వివరాలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. జూబ్లీహిల్స్ శ్రీవెంకటేశ్వరస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 17 నుండి 25వ తేదీ వరకు జరుగనున్నాయని టీటీడీ ఛైర్మెన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించి గోడ పత్రికలను, ఆహ్వాన పత్రికలను శనివారం జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బీఆర్ నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తుగా అంచనా వేసి ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్, పుష్పాలంకరణలు చేపట్టాలని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, క్యూ లైన్లు, తాగునీరు, అన్నప్రసాదాలు, పటిష్ట సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

# మెడిసిన్ విభాగం క్రిటికల్ కేర్ విభాగానికి మార్పు

జగిత్యాల, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): జగిత్యాల ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ( ఓల్డ్ బిల్డింగ్ హాస్పిటల్, పాత బస్టాండ్)లో నిర్వహిస్తున్న జనరల్ మెడిసిన్ విభాగాన్ని సోమవారం నుంచి మాత శిశు ఆసుపత్రి, బస్ డిపో ఎదురుగా ఉన్న నూతన క్రిటికల్ కేర్ భవనంలోకి మార్చుతున్నట్లు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ తెలిపారు. జిల్లా ప్రజలు జనరల్ మెడిసిన్ సేవలు క్రిటికల్ కేర్ భవనంలో పొందాలని సూ సూచించారు.

# 28 వరకు మేడిపెల్లి మోడల్ స్కూల్ దరఖాస్తులు

మేడిపెల్లి, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మేడిపెల్లి మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 28 వరకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఓసీ విద్యార్థులకు రూ.200, మిగతావారికి రూ.125 దరఖాస్తు రుసుం స్వీకరించనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు https://tgms.telangana.gov.inను సంప్రదించాలని సూచించారు.



# విమర్శలొస్తే లడ్డూ తెరపైకి

**రాజకీయాల కోసం తిరుమలపై రాజకీయాలు**

**తమ హయాంలోనే 3,000 ఆలయాలు నిర్మించాం**

**ఏపీ మాజీమంత్రి కురసాల కన్నబాబు**

విజయవాడ, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే తిరుపతి లడ్డూ వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని వైసీపీ నేత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తీవ్రంగా ఆరోపించారు. ఆదివారం కాకినాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా కీలక హామీలను నెరవేర్చలేక, విమర్శలు ఎదురైనప్పుడల్లా లడ్డూ అంశాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు తిరుమల పవిత్రతను దెబ్బతీస్తూ, హిందువుల మనోభావాలను గాయపరుస్తున్నారని కన్నబాబు ఆరోపించారు. లడ్డూలో జంతు కొవ్వు కలిపారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలోని సిట్ బృందం విచారణ జరిపి, ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసినా అధికార కూటమి తప్పుడు ప్రచారం ఆపడం లేదని మండిపడ్డారు. వివాదానికి కారణమైన నెయ్యి నమూనాలను తమ కూటమి అధికారంలోకి వచ్చాకే సేకరించారని, అసలు బోలే బాబా డెయిరీకి అనుమతులు ఇచ్చిందే చంద్రబాబు గత ప్రభుత్వమని గుర్తుచేశారు. సిట్ నివేదికతో అబద్ధాలు బయటపడటంతో, ఇప్పుడు లడ్డూ తయారీలో 'టాయిలెట్ క్లీనింగ్ కెమికల్స్' వాడారంటూ చంద్రబాబు కొత్త ఆరోపణలు చేస్తున్నారని కన్నబాబు అన్నారు. జగన్‌ను రాజకీయంగా లక్ష్యంగా చేసుకోవడానికే ఈ దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో దాదాపు 3,000 ఆలయాలను నిర్మించామని, తిరుమల ఏడు కొండలను కాపాడామని తెలిపారు. తప్పుడు ఆరోపణలపై క్షమాపణ చెప్పాలని కోరిన తమ పార్టీ నేతలపై దాడులు చేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తున్నారని కన్నబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోలీసుల సాయంతో 'జంగిల్ రాజ్' నడుస్తోందని ఆయన విమర్శించారు.

# ఏపీ సీఎం టైం ఇవ్వట్లేదు: డీకే

బెంగళూరు: తుంగభద్ర జలాశయం నుంచి సుమారు 30 టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోకుండా నివారించే అంశంపై చర్చించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తనకు సమయం ఇవ్వడం లేదని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. స్థానిక నేతల నుంచి వస్తున్న ఒత్తిడి మేరకు ఈ నీటిని కాపాడేందుకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. శనివారం రాయచూర్‌లో జరిగిన 'రాయచూర్ ఉత్సవ్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "ఏపీ సీఎం గనుక మాకు అవకాశం ఇస్తే, 30 టీఎంసీల తుంగభద్ర నీటి వృథాను అరికట్టి, ఈ ప్రాంత రైతులు, ప్రజలకు న్యాయం చేస్తాం" అని శివకుమార్ అన్నారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థ కథనం ప్రకారం.. కాలువల చివరి భూములకు నీరు చేరేలా తమ ప్రభుత్వం కొత్త చట్టం చేసిందని ఆయన గుర్తుచేశారు. గతంలో తాను నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాంతాన్ని సందర్శించానని, బంగారప్ప చెరువు కోసం రూ.300 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. తుంగభద్ర డ్యామ్ గేట్లన్నింటినీ మార్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ పనిని తప్పక పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ఆయన ఏకరువు పెట్టారు. మధ్యాహ్న భోజనం, ఉపాధి హామీ, స్త్రీ శక్తి వంటి పథకాలు కాంగ్రెస్ హయాంలోనే ఈ ప్రాంతం నుంచి ప్రారంభమయ్యాయని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎంతో పోరాడి ఆర్టికల్ 371జీ ను తీసుకొచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేశారని, ఆయనను ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. తమ ఐదు గ్యారంటీల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తెస్తున్నామని తెలిపారు. రాయచూర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని, ఎయిమ్స్ స్థాయి సంస్థను ఇక్కడికి తీసుకురావడానికి కేంద్రానికి లేఖ రాశామని డీకే శివకుమార్ వివరించారు. భవిష్యత్తులో కూడా కాంగ్రెస్ పార్టీకే మద్దతుగా నిలవాలని ఆయన ప్రజలను కోరారు.

# బూతుల నేతలకు పోలింగ్‌తో బుద్ధి

**వెంకయ్యనాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు**



వైజాగ్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): బూతులు మాట్లాడే రాజకీయ నేతలపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వారికి ప్రజలు పోలింగ్ బూత్‌లలోనే తగిన సమాధానం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో పలువురు రాజకీయ నాయకులు మాట్లాడే భాషపై వెంకయ్యనాయుడు పలు సందర్భాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజాగా విశాఖ జిల్లా పెందుర్తిలో బాలాజీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలోనూ ఆయన రాజకీయ నాయకుల భాషపై స్పందించారు. కొంతమంది రాజకీయ నాయకులకు బూతులు మాట్లాడటం ఫ్యాషన్‌గా మారిపోయిందని వెంకయ్యనాయుడు విమర్శించారు. అలా మాట్లాడితే పత్రికల్లో ప్రచురిస్తారని, వార్తల్లో వస్తామని భావించి అసభ్య పదజాలాన్ని ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. సక్రమంగా మాట్లాడే సామర్థ్యం లేక కొందరు నేతలు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై కూడా వ్యాఖ్యలు చేసే దుస్థితికి దిగజారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి అన్ని పార్టీల నాయకుల్లోనూ ఉందని, అయితే కొందరు మాత్రం ఇంకా పద్ధతిగా, మంచిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అసందర్భంగా ప్రసంగాలు చేసే నేతలకు ప్రజలు ఎన్నికల్లో నిశ్శబ్దంగా గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని, అప్పుడే అసెంబ్లీ, పార్లమెంటులో మంచి విలువలు పెరుగుతాయని, భవిష్యత్తు తరాలు మంచి విషయాలను నేర్చుకుంటాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రాజకీయ నాయకులు గుర్తుంచుకోవాలని వెంకయ్యనాయుడు సూచించారు.

# నర్సులకు రూ.20 వేలు జీతం ఇవ్వాలి

**నక్క సూర్య కుమార్ డిమాండ్**



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో పనిచేస్తున్న వేలాది నర్సులు ఈరోజు తీవ్రమైన ఆర్థిక, శారీరక, మానసిక వేధింపులకు లోనవుతున్నారని తెలంగాణ ఫ్లోరెన్స్ నర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క సూర్య కుమార్ తెలిపారు.. సమాజానికి సేవ చేయాలనే ఒకే ఒక్క లక్ష్యంతో నర్సింగ్ వృత్తిని ఎంచుకున్న నర్సులు, తమ జీవితాల్లో మాత్రం కనీస గౌరవం లేకుండా జీవించాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. 'రోజుకు 10 నుంచి 12 గంటల పాటు నిరంతరంగా డ్యూటీలు, నైట్ షిఫ్టులు, ఎమర్జెన్సీ బాధ్యతలు నిర్వర్తిస్తూ కూడా నర్సులకు నెలకు సరిపడని జీతాలు ఇస్తున్నారు. చాలామంది నర్సులు అద్దె ఇల్లు, పిల్లల చదువు, వైద్య ఖర్చులు, కుటుంబ బాధ్యతలు నిర్వహించలేని స్థితిలో ఉన్నారు. కొందరు నర్సులు అప్పుల్లో కూరుకుపోతున్నారు, మరికొందరు మానసిక ఒత్తిడితో ఉద్యోగాలు వదిలివేయాల్సి వస్తోంది అని మాట్లాడినారు. ప్రాణాలను కాపాడే నర్సులు, తమ కుటుంబాల ప్రాణాలు కాపాడుకోలేని పరిస్థితి రావడం రాష్ట్రానికి, సమాజానికి అవమానం. కోవిడ్ కాలంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించిన నర్సులు, ఈరోజు మాత్రం కనీస వేతనం కోసం పోరాడాల్సిన దుస్థితి ఏర్పడింది' అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, కార్మిక శాఖ, ఆరోగ్య శాఖ, సంబంధిత అధికారులు ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణలోకి తీసుకుని, నర్సులకు న్యాయం చేయాలని కోరారు. నర్సుల గౌరవం, జీవన భద్రత కోసం ఈ పోరాటం కొనసాగుతుందని, నర్సులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ ఫ్లోరెన్స్ నర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు.

# కులం పుట్టుకతో వచ్చేది

**ఎంపిక చేసుకునేది కాదు: నాగబాబు**



మంగళగిరి, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): జనసేన పార్టీ ఎమ్మెల్సీ నాగబాబు, వైసీపీ నేతలపై, ముఖ్యంగా ఆ పార్టీలోని కాపు నాయకులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కులాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూసే వైసీపీ నేతలకు కాలం చెల్లిందని, ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఇప్పుడున్న 11 సీట్లు కూడా దక్కవని ఆయన హెచ్చరించారు. జనసేన సిద్ధాంతాలను వివరిస్తూనే, వైసీపీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగడుతూ ఆయన పలు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, "మన దేశంలో కులం అనేది ఒక సామాజిక వాస్తవికత. ఎవరు ఏ కులంలో పుడతారో, దాన్ని ఎప్పటికీ మార్చుకోలేం. కుల రహిత సమాజం అనేది ఒక ఉన్నతమైన ఆశయమే అయినా, రాజకీయాల్లో వాస్తవ పరిస్థితులను అంగీకరించాలి. అందుకే పవన్ కల్యాణ్ గారు 'కులాలను కలిపే ఆలోచనా విధానాన్ని' జనసేన మూల సిద్ధాంతాల్లో ఒకటిగా చేర్చారు. సమాజంలో అధిక సంఖ్యలో ఉన్న కులాలు, అల్పసంఖ్యాక కులాలను ప్రోత్సహించి పెద్దన్న పాత్ర పోషించాలి," అని అన్నారు. ఇందుకు ఉదాహరణగా, 40 శాతం కాపు జనాభా ఉన్న అనకాపల్లి స్థానాన్ని బీసీ వర్గానికి చెందిన కొనతాల రామకృష్ణకు కేటాయించామని, అక్కడ కాపులు, గౌరలు కలిసి పనిచేసి ఆ సీటును గెలిపించుకున్నారని గుర్తుచేశారు. అలాగే, విశాఖ సౌత్‌లో బీసీ యాదవ వర్గానికి చెందిన వంశీకృష్ణ యాదవ్‌కు టికెట్ ఇవ్వగా, రాష్ట్రంలోనే అత్యధిక ఓట్ల శాతంతో గెలిచారని, ఇది తమ సిద్ధాంత నిబద్ధతకు నిదర్శనమని నాగబాబు స్పష్టం చేశారు. వైసీపీ నేతలపై విమర్శలు గుప్పిస్తూ, "నిజం మాట్లాడితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం వైసీపీ నేతలకు ఉంది. వారు నోరు విప్పితే అబద్ధాలు, బూతులు తప్ప మరేమీ రావు. తాగుబోతులు, తిరుగుబోతులు అంటూ కాపు కులాన్ని కించపరిచే అంబటి రాంబాబు వంటి వారిని, వంగవీటి రంగా గారి ఫొటో పక్కన పెట్టి కాపు కుల ఐకాన్‌గా చూపాలని చూశారు. మీ ఈ ఆలోచనే మిమ్మల్ని ముంచింది" అని దుయ్యబట్టారు. ఈ క్రమంలో వైసీపీ కాపు నేతలను ఉద్దేశించి నాగబాబు పలు ప్రశ్నలు లేవనెత్తారు. "గ్రేటర్ రాయలసీమలోని 6 జిల్లాల్లో 20 శాతం బలిజ, కాపులు ఉన్నా ఒక్క ఎంపీ సీటు, 74 అసెంబ్లీ సీట్లలో పర్చూరు తప్ప ఒక్క సీటూ ఎందుకు ఇవ్వలేదు? దీనిపై అంబటి, పేర్ని నాని వంటి వారు జగన్‌ను ఎప్పుడైనా ప్రశ్నించారా? తరతరాలుగా బలిజలు గెలుస్తున్న రాజంపేట ఎంపీ సీటును మిథున్ రెడ్డికి కట్టబెట్టినప్పుడు మీరెక్కడ ఉన్నారు?" అని నిలదీశారు. వంగవీటి రంగా గారిపై వైసీపీది కపట ప్రేమ అని, ఆయన కుమారుడు రాధాను పార్టీ నుంచి పంపించి, రంగా గారిని దూషించిన గౌతం రెడ్డికి పదవి కట్టబెట్టారని ఆరోపించారు. 'కాపు నేస్తం' పథకానికి వైఎస్సార్ పేరు పెట్టినప్పుడు, కాపు కులంలో పుట్టిన మహానుభావుల పేర్లు పెట్టాలని మీ నాయకుడిని ఎప్పుడైనా అడిగారా? అని ప్రశ్నించారు. "ఇది జెన్[illegible]జి తరం. మీరు ఇంకా రాజనాల కాలం నాటి కుల రాజకీయాలు చేస్తే, ఈ 11 సీట్లు కూడా మిగలవు. ఆలోచించుకోండి" అని నాగబాబు హితవు పలికారు.

# లడ్డూపై భక్తులు ధైర్యంగా మాట్లాడాలి

**ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్**



తెనాలి, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): తిరుమల లడ్డు నెయ్యి కల్తీ వివాదంపై ప్రతి హిందూ భక్తుడు ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. భక్తుల మనోభావాలను గౌరవించడమే నిజమైన ధర్మరక్షణ అని, ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీకో సంబంధించిన అంశం కాదని, కోట్లాది మంది విశ్వాసాలతో ముడిపడిన అత్యంత సున్నితమైన విషయమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యవహారాన్ని రాజకీయ కక్షసాధింపుగా మార్చేందుకు వైసీపీ చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. తిరుమల లడ్డులో కల్తీ జరిగిందన్న అంశంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగిన విచారణలో, సీబీఐ సమర్పించిన నివేదిక వాస్తవాలను వెలుగులోకి తెచ్చిందని మంత్రి గుర్తుచేశారు. "60 లక్షల లీటర్ల నెయ్యిలో ఒక్క చుక్క కూడా అసలైన నెయ్యి లేదని నివేదిక స్పష్టం చేసిన తర్వాత కూడా వైసీపీ నాయకులు ఎదురుదాడి చేయడం దుర్మార్గం. వారికి ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "అయోధ్యకు పంపిన లడ్డూల కోసం 'ప్రత్యేక నెయ్యి' వాడామని వైసీపీ నేతలు చెప్పడమే, తిరుమలలో వాడే నెయ్యి నాణ్యమైనది కాదని వారికి ముందే తెలుసనడానికి నిదర్శనం" అని మనోహర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్, పలమనేరు నుంచి ప్రత్యేకంగా నెయ్యి తెప్పించి అయోధ్యకు లడ్డూలు పంపామని చెప్పడం ద్వారా, ఐదేళ్లుగా మిగిలిన లడ్డూల తయారీలో ప్రజలను ఎలా మోసం చేశారో వారే అంగీకరించినట్టయిందని ఆయన విమర్శించారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై వ్యక్తిగత దాడులుగా మలచాలని చూస్తున్నారని, సమాజం ఈ కుట్రను గమనించాలని కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచన ఎల్లప్పుడూ హిందూ ధర్మాన్ని కాపాడటమే తప్ప, ఇతర మతాలను కించపరచడం కాదని ఆయన స్పష్టం చేశారు. తప్పు జరిగిందని అంగీకరించి క్షమాపణ చెప్పాల్సింది పోయి, ప్రెస్ మీట్లు పెట్టి ఎదురుదాడి చేయడం వారి పైశాచిక ఆనందానికి నిదర్శనమని అన్నారు. ఈ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా పరిగణించి, మఠాధిపతులు, పీఠాధిపతులు, ధార్మిక పెద్దలతో ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి వాస్తవాలను వెలికి తీయాల్సిన అవసరం ఉందని మంత్రి మనోహర్ అభిప్రాయపడ్డారు.

# నామ్ నరేందర్... కామ్ సరెండర్

**ప్రధాని మోదీపై షర్మిల విమర్శనాస్త్రాలు**



విజయవాడ, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది 'గ్రేట్ డీల్' కాదని, భారతదేశానికి ఇదొక 'బ్లాక్ డీల్' అని అభివర్ణించారు. ప్రధాని మోదీ తీరు 'నామ్ నరేందర్.. కామ్ సరెండర్' (పేరు: నరేందర్... వృత్తి: లొంగిపోవడం) అన్నట్లుగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. అగ్రరాజ్యం బ్లాక్ మెయిల్‌కు తలొగ్గి, ప్రధాని మోదీ దేశ ప్రజల ప్రయోజనాలను పూర్తిగా తాకట్టు పెట్టారని, ఆయన అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారారని షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందం దేశ భవిష్యత్తుకే అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ఉత్పత్తులపై సున్నా సుంకాలు విధించడం ద్వారా భారత మార్కెట్లను వారికి అప్పగించడం, మన స్వదేశీ పరిశ్రమలకు, రైతాంగానికి మరణశాసనం రాయడమేనని షర్మిల దుయ్యబట్టారు. "మన దేశ ఎగుమతులపై అమెరికా 18 శాతం సుంకాలు తగ్గిస్తే, వారి దిగుమతులపై మోదీ గారు సుంకాలు సున్నా చేయడం ఏంటి? మొన్నటిదాకా మన ఉత్పత్తులపై అమెరికా వేసిన పన్నులు 5 శాతం లోపే. ఇప్పుడు దాన్ని 50 శాతానికి పెంచి, అందులో 18 శాతం కుదిస్తే మనకు ప్రయోజనం ఎలా కలుగుతుంది? దీనివల్ల భారత్‌కు దక్కే ప్రయోజనం కంటే, సున్నా సుంకాలతో అమెరికాకు 100 శాతం లాభం చేకూరుతుంది" అని షర్మిల విమర్శించారు. ఇది భారత రైతుల మెడకు ఉరిపెట్టి, అమెరికా వ్యవసాయానికి మోదీ ఇచ్చిన గ్రేట్ డీల్ అని ఆమె మండిపడ్డారు. అధ్యక్షుడు ట్రంప్ కోసం ప్రధాని మోదీ "మేక్ ఇన్ ఇండియా" నినాదానికి తిలోదకాలు ఇచ్చారని షర్మిల ఆరోపించారు. "రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ తీసుకుంటే మళ్లీ సుంకాలు 50 శాతం పెంచుతామని ట్రంప్ బహిరంగంగా బెదిరిస్తుంటే ఇది బ్లాక్ మెయిల్ కాదా? ఆ భయంతోనే మోదీ సాగిలపడ్డారు," అని ఆమె వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందాలు ఇరు దేశాల మధ్య సమతూకంగా ఉండాలి కానీ, ఒక దేశానికి నష్టం, మరో దేశానికి లాభం చేసేవాటిని ఒప్పందాలు అనరని అన్నారు. 75 ఏళ్ల భారత వాణిజ్య ఒప్పందాల చరిత్రను మోదీ తుంగలో తొక్కారని, 50 కోట్ల వ్యవసాయ ఆధారిత కుటుంబాల కన్నా అమెరికా ప్రయోజనాలే ఆయనకు ముఖ్యమయ్యాయని విమర్శించారు. ఏటా 100 బిలియన్ డాలర్ల దేశ సంపదను అమెరికాకు అప్పనంగా కట్టబెట్టే కుట్రలో ఈ ఒప్పందం భాగమని ఆరోపించారు. భారత ప్రధాని విదేశం ఎదుట లొంగిపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ప్రధాని మోదీ వెంటనే ఈ 'సరెండర్ అగ్రిమెంట్' పూర్తి వివరాలను బయటపెట్టాలని, కేవలం రెండు మూడు వస్తువుల గురించి కాకుండా అమెరికా నుంచి దిగుమతి కాబోయే అన్ని ఉత్పత్తులు, వాటిపై విధించే పన్నుల వివరాలను జాతికి తెలియజేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# వాషింగ్టన్ పోస్ట్ సీఈవో ఆకస్మిక రాజీనామా

వాషింగ్టన్: ప్రముఖ అమెరికన్ వార్తాపత్రిక 'ది వాషింగ్టన్ పోస్ట్'లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సంస్థ పబ్లిషర్, సీఈవోగా వ్యవహరిస్తున్న విల్ లూయిస్ తన పదవికి ఆకస్మికంగా రాజీనామా చేశారు. 300 మందికి పైగా జర్నలిస్టులు సహా సిబ్బందిలో మూడో వంతు మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించిన మూడు రోజులకే ఆయన వైదొలగడం గమనార్హం. శనివారం సాయంత్రం సంస్థ ఉద్యోగులకు పంపిన ఒక ఈ-మెయిల్‌లో లూయిస్ తన రాజీనామా విషయాన్ని వెల్లడించారు. "వాషింగ్టన్ పోస్ట్‌లో రెండేళ్ల పరివర్తన తర్వాత, నేను తప్పుకోవడానికి ఇదే సరైన సమయం. పత్రిక సుస్థిర భవిష్యత్తు కోసం కఠినమైన నిర్ణయాలు తీసుకున్నాం" అని ఆయన తన ఈ-మెయిల్‌లో పేర్కొన్నారు. సంస్థలో తీవ్రమైన ఆర్థిక నష్టాల కారణంగా ఖర్చులను తగ్గించుకునేందుకు ఇటీవల భారీ లేఆఫ్‌లు ప్రకటించారు. ఈ తొలగింపుల ప్రకటన సమయంలో విల్ లూయిస్ అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వచ్చాయి. ఆయన 2024 జనవరిలో సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. విల్ లూయిస్ రాజీనామాతో సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) జెఫ్ డి'ఒనోఫ్రియోను తాత్కాలిక పబ్లిషర్, సీఈవోగా నియమించినట్లు వాషింగ్టన్ పోస్ట్ ప్రకటించింది. కొత్త తాత్కాలిక నాయకత్వానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని పత్రిక యజమాని జెఫ్ బెజోస్ ఒక ప్రకటనలో తెలిపారు.

# 92 మంది విద్యార్థులకు వాంతులు

పోలవరం, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో గల ఓ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో 92 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణకు ఆదేశించారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం లోగా దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే.. పోలవరం జిల్లా రంపచోడవరం మండలం దేవరపల్లిలోని ఆశ్రమ బాలుర వసతి గృహంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారులతో చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. శనివారం ఉదయం అల్పాహారం తిన్న తర్వాత 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయని అధికారులు సీఎంకు వివరించారు. వెంటనే వారిని మారేడుమిల్లి, రంపచోడవరంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వారు పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే హాస్టల్‌ను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను అంచనా వేశామని అధికారులు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న మిగతా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు, ఆహారం, నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపినట్లు వివరించారు. ఈ ఘటనపై విచారణకు ఒక జాయింట్ ఇన్స్‌పెక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# తోషఖానా-2 కేసులో ఇమ్రాన్‌కు 17 ఏళ్ల శిక్ష

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు న్యాయస్థానంలో మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. తీవ్ర సంచలనం సృష్టించిన తోషఖానా-2 అవినీతి కేసులో ఆయనకు, ఆయన భార్య బుష్రా బీబీకి ప్రత్యేక కోర్టు 17 ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష విధించింది. అధికారంలో ఉన్నప్పుడు సౌదీ ప్రభుత్వం నుంచి అందిన ఖరీదైన బహుమతులను ప్రభుత్వ ఖజానాలో జమ చేయకుండా, తక్కువ ధరకు అక్రమంగా సొంతం చేసుకున్నారన్న ఆరోపణలు ఈ కేసులో రుజువయ్యాయి. రావల్పిండిలోని అడియాలా జైలులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి షారుఖ్ అర్జుమంద్ ఈ తీర్పును వెలువరించారు. నేరపూరిత విశ్వాసఘాతుకానికి పాల్పడినందుకు 10 ఏళ్లు, అవినీతి నిరోధక చట్టం కింద మరో 7 ఏళ్ల జైలు శిక్షను ఖరారు చేశారు. దీంతో పాటు ఇద్దరికీ చెరో రూ. 1.64 కోట్ల జరిమానా కూడా విధించారు. ఇమ్రాన్ ఖాన్ వయసు, బుష్రా బీబీ మహిళ కావడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కాస్త తక్కువ శిక్ష విధించినట్లు తీర్పులో పేర్కొన్నారు. 2022 ఏప్రిల్‌లో అధికారం కోల్పోయినప్పటి నుంచి 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ డజన్ల కొద్దీ కేసులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. 2023 ఆగస్టు నుంచి ఆయన అడియాలా జైలులోనే ఉంటున్నారు. ఈ తాజా తీర్పుతో ఆయనపై ఉన్న కేసుల సంఖ్య, శిక్షల కాలం మరింత పెరిగింది.

# బంగ్లాదేశ్‌లో కనుమరుగవుతున్న మహిళా నేతలు

**మతవాద శక్తుల నుంచి బెదిరింపులే కారణం!**




ఢాకా: ఒకప్పుడు దక్షిణాసియాలో మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచిన బంగ్లాదేశ్ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. దశాబ్దాల పాటు ఇద్దరు మహిళా దిగ్గజాల చుట్టూ తిరిగిన దేశ రాజకీయాల్లో ఇప్పుడు తీవ్రమైన శూన్యత నెలకొంది. 2024లో జరిగిన హింసాత్మక ఆందోళనల తర్వాత జరగనున్న తొలి ఎన్నికల్లో మహిళా ప్రాతినిధ్యం అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పటి మహిళా ప్రధానులు షేక్ హసీనా (ప్రస్తుతం ప్రవాసంలో ఉన్నారు), ఖలీదా జియా (ఇటీవల మరణించారు) లేని లోటు రాజకీయపరంగా తీర్చలేనిది. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా బంగ్లాదేశ్ రాజకీయాలను ఇద్దరు మహిళా నేతలు శాసించారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీకి నాలుగు దశాబ్దాలు నాయకత్వం వహించి, మూడుసార్లు ప్రధానిగా పనిచేసిన ఖలీదా జియా డిసెంబర్ 2025లో కన్నుమూశారు. మరోవైపు, ఐదుసార్లు ప్రధానిగా రికార్డు సృష్టించిన షేక్ హసీనా, 2024 జులైలో జరిగిన ప్రజా తిరుగుబాటు తర్వాత పదవీచ్యుతులై ప్రస్తుతం ప్రవాసంలో జీవిస్తున్నారు. ఈ ఇద్దరు కీలక నేతలు తెరమరుగు కావడంతో దేశ రాజకీయాల్లో మహిళల స్థానం ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిణామం దేశంలో పెరుగుతున్న తీవ్రవాదం, మత ఛాందసవాదానికి అద్దం పడుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ప్రొఫెసర్ మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 12న ఎన్నికలు జరగనున్నాయి. దేశంలోని 300 పార్లమెంటరీ స్థానాలకు గాను మొత్తం 1,981 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, వారిలో మహిళలు కేవలం 76 మంది మాత్రమే ఉండటం గమనార్హం. ఇది మొత్తం అభ్యర్థుల్లో 4 శాతం కన్నా తక్కువ. తీవ్రవాద శక్తుల నుంచి వస్తున్న బెదిరింపులు, భయానక వాతావరణం కారణంగానే రాజకీయ పార్టీలు మహిళలకు టికెట్లు ఇవ్వడానికి వెనుకాడుతున్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా, దేశంలోని అతిపెద్ద ఇస్లామిస్ట్ పార్టీ అయిన జమాత్-ఎ-ఇస్లామీ ఒక్క మహిళా అభ్యర్థిని కూడా నిలబెట్టకపోవడం ఈ ధోరణికి నిదర్శనంగా చెబుతున్నారు. హసీనా అనంతర యుగంలో ఛాందసవాద శక్తుల ప్రభావం పెరగడంతో మహిళలను రాజకీయంగా అణచివేస్తున్నారని, వారిని కించపరిచేలా ప్రచారం చేస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "ఒకప్పుడు ఇద్దరు మహిళా నాయకులు దేశాన్ని నడిపించడం చూసి గర్వపడ్డాను. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. మహిళా నేతలను అంచెలంచెలుగా పక్కకు నెట్టేస్తున్నారు" అని బంగ్లాదేశ్‌కు చెందిన ఓ కొత్త ఓటరు తన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితం ఎవరికి అనుకూలంగా వచ్చినా, రాబోయే రోజుల్లో బంగ్లాదేశ్‌ను దాదాపు పూర్తిగా పురుషులే పాలించబోతున్నారన్నది స్పష్టం. పార్లమెంటులో మహిళల కోసం 50 సీట్లు రిజర్వ్ చేసినప్పటికీ, ప్రత్యక్ష ఎన్నికల్లో వారి ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గడం దేశ ఉదారవాద స్వభావానికే ప్రమాద సంకేతంగా మారింది.

## బంగ్లా హిందువులకు మా మద్దతు


**ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్**

ముంబై: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ బంగ్లాదేశ్‌లోని హిందువుల పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులు తమ హక్కుల కోసం పోరాడాలని నిర్ణయించుకుంటే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులందరూ వారికి అండగా నిలుస్తారని ఆయన భరోసా ఇచ్చారు. ముంబైలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముంబైలోని వర్లీలో ఉన్న నెహ్రూ సెంటర్‌లో '100 ఇయర్స్ ఆఫ్ సంఘ్ జర్నీ: న్యూ హొరైజన్స్' పేరిట రెండు రోజుల కార్యక్రమం జరిగింది. రెండో రోజైన ఆదివారం భగవత్ ప్రసంగించారు. "బంగ్లాదేశ్‌లో సుమారు 1.25 కోట్ల మంది హిందువులు ఉన్నారు. వారు అక్కడే ఉండి పోరాడాలని నిర్ణయించుకుంటే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులంతా వారికి సహాయం చేస్తారు" అని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై, ముఖ్యంగా హిందువులపై దాడులు పెరిగాయని భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది జరిగిన 'జూలై తిరుగుబాటు', మాజీ ప్రధాని షేక్ హసీనా పదవీచ్యుతి తర్వాత ఈ హింస మరింత పెరిగిందన్నారు. ఈ దాడుల్లో ఎంతోమంది హిందువులు ప్రాణాలు కోల్పోయారని ఆయన గుర్తుచేశారు. ఇదే సందర్భంగా భారత్‌పై కూడా భగవత్ మాట్లాడారు. దేశంలో జనాభా మార్పులను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వం సరైన చర్యలు తీసుకుంటోందని అన్నారు. "ఇప్పుడు భారత్‌ను ఎవరూ బలహీనపరచలేరు. దేశాన్ని విడగొట్టాలని చూసేవారే విడిపోతారు" అని ఆయన హెచ్చరించారు. సంఘ్ ఎవరికీ వ్యతిరేకం కాదని, అధికారం కోసం పనిచేయదని, మరెవరినో నడిపించే రిమోట్ కంట్రోల్ అంతకన్నా కాదని పునరుద్ఘాటించారు. సంఘ్ నిధులు స్వయంసేవకుల నుంచే వస్తాయని, ఆర్ఎస్ఎస్ చీఫ్ పదవికి కులంతో సంబంధం లేదని భగవత్ స్పష్టం చేశారు.

## 'కిడ్నాప్' కు ఆధారాల్లేవు


**చోక్సీకి యూకే కోర్టు షాక్**

లండన్: పంజాబ్ నేషనల్ బ్యాంకు మోసం కేసులో విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీకి యూకే కోర్టు షాకిచ్చింది. ఆయన చెబుతున్న 'కిడ్నాప్' ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని పేర్కొంది. చోక్సీ ఆరోపణలే తప్ప ఆయన కిడ్నాప్ కావడం ప్రత్యక్షంగా చూసిన వారు ఎవరూ లేరని చెప్పింది. చోక్సీ లాయర్ చూపించిన సందర్భోచిత సాక్ష్యాలను పరిగణలోకి తీసుకుని విచారణ సాగిస్తామని పేర్కొంటూ.. రూ.7.3 కోట్లు సెక్యూరిటీ బాండ్ కోర్టుకు సమర్పించాలని చోక్సీని ఆదేశించింది. విదేశాలకు పారిపోయిన మెహుల్ చోక్సీ కొంతకాలం ఆంటిగ్వాలో తలదాచుకున్నాడు. పంజాబ్ నేషనల్ బ్యాంకు మోసం కేసులో తనను భారత్ కు తరలించేందుకు కొంతమంది కుట్ర పన్నారని చోక్సీ ఆరోపించారు. హంగేరీకి చెందిన బార్బరా జబారికతో కలిసి భారత ఏజెంట్లు తనను కిడ్నాప్ చేశారని యూకే కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. జబారిక తనతో స్నేహం నటించి ఆంటిగ్వా నుంచి బలవంతంగా డొమినికాకు తీసుకెళ్లిందని, తప్పించుకుని బయటపడిన తనను బెల్జియం పోలీసులు అరెస్టు చేశారని చోక్సీ చెప్పాడు.



# సూపర్ రేస్ జాతిని కనాలనుకున్నాడు!

**లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్ ప్లాన్**



వాషింగ్టన్: లైంగిక నేరాల ఆరోపణలతో జైలులో ఆత్మహత్య చేసుకున్న అమెరికన్ ఫైనాన్సియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించి మరో భయానక వాస్తవం వెలుగులోకి వచ్చింది. కేవలం లైంగిక నేరాలకే పరిమితం కాకుండా, తన డీఎన్ఏతో ఒక 'సూపర్ రేస్' (అత్యున్నత మానవ జాతి)ని సృష్టించాలని అతడు కలలు కన్నట్లు తాజా నివేదికలు బయటపెట్టాయి. ఇందుకోసం తన న్యూ మెక్సికోలోని 'జోరో రాంచ్' ఎస్టేట్‌లో ఒక 'బేబీ రాంచ్' ఏర్పాటు చేయాలని ప్రణాళిక రచించాడు. ఎప్‌స్టీన్ తన ప్రణాళిక ప్రకారం, ఒకేసారి 20 మంది మహిళలను ఎంపిక చేసి, వారిని తన స్పెర్మ్ (వీర్యం)తో గర్భవతులుగా చేయాలని భావించాడు. ఈ ఆలోచనను అతడు చాలా సంవత్సరాల పాటు పలువురు శాస్త్రవేత్తలు, వ్యాపారవేత్తలతో పంచుకున్నాడు. 2001 నుంచి 2006 మధ్య కాలంలో ఈ విషయాన్ని విన్న శాస్త్రవేత్తలు, సలహాదారులు ఆ ప్రణాళిక అత్యంత భయంకరమైనదిగా, వికృతమైనదిగా అభివర్ణించారు. ఈ ఆలోచనకు స్ఫూర్తిగా, నోబెల్ గ్రహీతల స్పెర్మ్‌ను సేకరించి ఉన్నత జాతిని సృష్టించాలనే లక్ష్యంతో పనిచేసిన 'రిపోజిటరీ ఫర్ జెర్మినల్ చాయిస్' అనే స్పెర్మ్ బ్యాంక్‌ను అతడు ఉదాహరణగా తీసుకున్నాడు. ఎప్‌స్టీన్ తన ప్రణాళికను 'ట్రాన్స్‌హ్యూమనిజం' అనే ఉద్యమంతో ముడిపెట్టాడు. జన్యు ఇంజినీరింగ్, కృత్రిమ మేధస్సు వంటి టెక్నాలజీలతో మానవ సామర్థ్యాలను మెరుగుపరచడమే దీని లక్ష్యం. అయితే, చాలామంది దీన్ని 20వ శతాబ్దంలో నాజీలు అనుసరించిన 'యూజెనిక్స్' సిద్ధాంతంతో పోలుస్తున్నారు. ఎంపిక చేసిన ప్రజల ద్వారా మాత్రమే సంతానోత్పత్తి జరిపి జాతిని మెరుగుపరచాలనే ఈ వాదన తీవ్ర వివాదాస్పదమైంది. తన ఆలోచనలకు శాస్త్రీయ ముద్ర వేసేందుకు ఎప్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్, ముర్రే గెల్-మాన్ వంటి ప్రఖ్యాత శాస్త్రవేత్తలతో సన్నిహిత సంబంధాలు నెరిపాడు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని ఓ కార్యక్రమానికి ఏకంగా 6.5 మిలియన్ డాలర్లు విరాళంగా ఇచ్చాడు. తన ప్రైవేట్ దీవుల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, సబ్‌మెరైన్‌లో విహార యాత్రలకు తీసుకెళ్లి శాస్త్రవేత్తలను ప్రలోభపెట్టాడు. అయితే, ఈ 'బేబీ రాంచ్' ప్రణాళిక ఆచరణలోకి రాలేదని తెలుస్తోంది. అతడికి పిల్లలు ఉన్నారా లేదా అనే దానిపై స్పష్టత లేదు. కానీ, ఇటీవల విడుదలైన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోని ఓ బాధితురాలి డైరీలో, తాను 16 ఏళ్ల వయసులో ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చానని, పుట్టిన వెంటనే శిశువును ఎప్‌స్టీన్ మాజీ భాగస్వామి గిస్లేన్ మాక్స్‌వెల్ తీసుకెళ్లిందని రాసి ఉంది. ఈ ఆరోపణలు ఇంకా ధృవీకరణ కాలేదు. అంతేకాకుండా, మరణం తర్వాత తన శరీరాన్ని, ముఖ్యంగా తల, పురుషాంగాన్ని భద్రపరచాలని (క్రయోనిక్స్) కూడా అతడు కోరుకున్నట్లు కొందరు తెలిపారు. ఎన్‌డీటీవీ వంటి మీడియా సంస్థలు, న్యూయార్క్ టైమ్స్ నివేదికల ఆధారంగా ఈ భయానక వివరాలు వెలుగులోకి వచ్చాయి.

# శత్రు శాటిలైట్లపై భారత్ నిఘా

**అంతరిక్షంలో గూఢచర్య సామర్థ్యం**



న్యూఢిల్లీ: అంతరిక్ష రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. కక్ష్యలో తిరుగుతున్న ఒక ఉపగ్రహం నుంచి మరో ఉపగ్రహం లేదా వస్తువుపై నిఘా పెట్టగల సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది. అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న 'అజిస్టా స్పేస్' అనే ప్రైవేట్ సంస్థ ఈ చారిత్రక ఘనతను సాధించింది. తమ ఏఎఫ్ఆర్ శాటిలైట్‌ను ఉపయోగించి, కక్ష్యలో తిరుగుతున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని (ఐఎస్ఎస్) విజయవంతంగా ట్రాక్ చేసి ఫొటోలు తీసింది. ఈ ప్రదర్శనతో అంతరిక్షంలో శత్రు దేశాల ఉపగ్రహాలపై గూఢచర్యం చేసే కీలక సాంకేతికత భారత్‌కు అందుబాటులోకి వచ్చినట్లయింది. 2023లో ప్రయోగించిన 80 కిలోల ఏఎఫ్ఆర్ శాటిలైట్ సుమారు 250 నుంచి 300 కిలోమీటర్ల దూరం నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం కదలికలను పసిగట్టి, స్పష్టమైన చిత్రాలను బంధించింది. దీనిని "నాన్-ఎర్త్ ఇమేజింగ్" (ఎన్ఈఐ) టెక్నాలజీగా పిలుస్తారు. ఇది దేశ అంతరిక్ష భద్రతకు, వ్యూహాత్మక ప్రయోజనాలకు అత్యంత కీలకం. అజిస్టా స్పేస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ భరత్ సింహా రెడ్డి మాట్లాడుతూ "స్పేస్ సిచ్యుయేషనల్ అవేర్‌నెస్ కు ఈ సామర్థ్యం చాలా అవసరం. ముఖ్యంగా సాయుధ దళాలు శత్రు దేశాల ఉపగ్రహాల కదలికలను గుర్తించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది" అని వివరించారు. 2019లో భారత్ 'మిషన్ శక్తి' ద్వారా యాంటీ-శాటిలైట్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించి, అంతరిక్షంలో ఉపగ్రహాలను కూల్చివేసే సామర్థ్యాన్ని ప్రదర్శించింది. ఇప్పుడు ఒక ఉపగ్రహంతో మరో ఉపగ్రహంపై నిఘా పెట్టగల ఈ కొత్త టెక్నాలజీతో అంతరిక్ష రక్షణ రంగంలో భారత్ మరింత పటిష్టంగా మారింది. భారత అంతరిక్ష విధానం-2023 ప్రకారం ప్రైవేట్ సంస్థలకు ఇస్తున్న ప్రోత్సాహం వల్లే ఈ విజయం సాధ్యమైందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.



## తమిళమే భారత్-మలేషియా బంధానికి వారధి

**మలేషియా పర్యటనలో ప్రధాని మోదీ వెల్లడి**

**ఇరు దేశాల మధ్య ఆడియో విజువల్ ఒప్పందంపై హర్షం**

**మలేషియాలో 12,000 మందితో ప్రధాని మోదీ భారీ సభ**

కౌలాలంపూర్: భారత్, మలేషియా మధ్య సాంస్కృతిక సంబంధాలను తమిళ భాష బలంగా పెనవేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇరు దేశాల మధ్య తాజాగా కుదిరిన ఆడియో విజువల్ ఒప్పందం ద్వారా తమిళ చిత్రాలు, సంగీతం మన హృదయాలను మరింత దగ్గర చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కౌలాలంపూర్‌లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి ఆదివారం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. మలేషియా విద్య, మీడియా, సాంస్కృతిక జీవనంలో తమిళ భాషకు బలమైన, సజీవమైన ఉనికి ఉందని మోదీ ప్రశంసించారు. అంతకుముందు శనివారం జరిగిన 'సెలమత్ దతాంగ్ మోదీజీ' కార్యక్రమంలో 12,000 మందికి పైగా ప్రవాస భారతీయులు, స్నేహితులు పాల్గొన్నారు. ఈ సభకు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా హాజరయ్యారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ప్రవాస భారతీయ సమాజం మలేషియాలో ఉందని, ఇరు దేశాల ప్రజల హృదయాలను కలిపే అంశాలు చాలా ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంకు లెజెండరీ నటుడు ఎంజీఆర్ పాటలంటే ఎంతో ఇష్టమని మోదీ గుర్తుచేశారు. బటు కేవ్స్‌లో జరిగిన తైపూసం వేడుకలు, మలేషియాలో గర్బా నృత్యం ప్రాచుర్యం పొందడం మన సాంస్కృతిక బంధానికి నిదర్శనమని అన్నారు. తమిళం ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప బహుమతి అని, తమిళ సాహిత్యం శాశ్వతమైనదని కొనియాడారు. భారత ఉపరాష్ట్రపతి, విదేశాంగ, ఆర్థిక మంత్రులు తమిళనాడుకు చెందినవారేనని ఆయన సభలో ప్రస్తావించారు. ఈ చారిత్రక స్ఫూర్తితో, ఇప్పటికే ఉన్న తిరువళ్లువర్ చైర్‌కు అదనంగా మలయా యూనివర్సిటీలో 'తిరువళ్లువర్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

## నైనా జైస్వాల్ ఎల్ఎల్ఎం పూర్తి

**15 ఏళ్లకే ఎంఏ పూర్తి చేసి ఆసియాలోనే రికార్డు**

**22 ఏళ్లకే పీహెచ్‌డీ సాధించిన ఘనత**



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఈవార్తలు): అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణిగా, అద్భుతమైన విద్యావేత్తగా పేరుగాంచిన నైనా జైస్వాల్ తన ఖాతాలో మరో అరుదైన మైలురాయిని చేర్చుకుంది. తాజాగా ఆమె ఎల్ఎల్ఎం (మాస్టర్ ఆఫ్ లా) ను ఫస్ట్ డివిజన్ విత్ డిస్టింక్షన్‌లో పూర్తి చేసినట్లు స్వయంగా వెల్లడించింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకుంటూ, తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. ఇది తన రెండో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ అని, ఈ విజయం తనకు ఎంతో ప్రత్యేకం అని ఆమె తెలిపింది. ఈ సందర్భంగా నైనా జైస్వాల్ తన భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టతనిచ్చింది. "ఈ ప్రయాణం ఇక్కడితో ముగియదు, ఇది ఒక శక్తివంతమైన ఆరంభం మాత్రమే. సరికొత్త సంకల్పంతో, మరింత పెద్ద లక్ష్యాలతో తదుపరి అధ్యాయం కోసం ఎదురుచూస్తున్నాను" అని ఆమె తన పోస్టులో పేర్కొంది. చిన్న వయసులోనే అసాధారణ విజయాలతో అందరినీ ఆశ్చర్యపరిచిన నైనా, ఇప్పుడు న్యాయశాస్త్రంలో ఉన్నత విద్యను పూర్తి చేసి మరోసారి వార్తల్లో నిలిచింది. నా జైస్వాల్‌కు అరుదైన విద్యా రికార్డులు ఉన్నాయి. ఆమె తన 8వ ఏటనే కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన ఐజీసీఎస్ఈ విధానంలో 10వ తరగతి పూర్తి చేసింది. 10 ఏళ్లకే ఇంటర్మీడియట్, 13 ఏళ్లకే సెయింట్ మేరీస్ కాలేజీ నుంచి జర్నలిజంలో బ్యాచిలర్ డిగ్రీ (బీఏ) సాధించింది. కేవలం 15 ఏళ్లకే ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్ (ఎంఏ) పూర్తి చేసి, 'ఆసియాలోనే అత్యంత పిన్న వయస్కురాలైన పోస్ట్ గ్రాడ్యుయేట్‌గా' రికార్డు సృష్టించింది. అంతటితో ఆగకుండా, 22 ఏళ్ల వయసులో రాజమండ్రిలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ నుంచి 'మహిళా సాధికారతలో మైక్రో-ఫైనాన్స్ పాత్ర' అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందింది. క్రీడా రంగంలోనూ నైనా తనదైన ముద్ర వేసింది. ఆమె అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణిగా సుపరిచితురాలు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో టైటిళ్లను గెలుచుకుంది. దక్షిణాసియా ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించింది. జాతీయ ఛాంపియన్‌షిప్‌లలోనూ పలుమార్లు విజేతగా నిలిచింది. ఒకే సమయంలో చదువులోనూ, క్రీడల్లోనూ అత్యున్నత ప్రతిభ కనబరచడం నైనా ప్రత్యేకత. చిన్న వయసులోనే అసాధారణ విజయాలు సాధించిన ఆమె, ఇప్పుడు న్యాయశాస్త్రంలోనూ ఉన్నత విద్యను పూర్తి చేసి నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

## పొలాల్లో కుప్పకూలిన విమానం

**ముందే దూకేసిన కెప్టెన్, ట్రైనీ పైలట్!**

**కర్ణాటకలోని విజయపుర జిల్లాలో ఘటన**

విజయపుర: కర్ణాటకలో ఆదివారం ఓ ప్రైవేట్ శిక్షణా విమానం కుప్పకూలింది. విజయపుర జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో విమానం పొలాల్లో క్రాష్ ల్యాండ్ అయింది. ఈ ప్రమాదంలో కెప్టెన్, ట్రైనీ పైలట్ గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే, రెడ్ బర్డ్ ఏవియేషన్‌కు చెందిన తేలికపాటి శిక్షణా విమానం కలబురగి నుంచి బెలగావికి బయలుదేరింది. మార్గమధ్యలో విజయపుర జిల్లా పరిధిలోని మంగళూరు సమీపంలోకి రాగానే ఇంజిన్‌లో సమస్య తలెత్తింది. దీంతో పైలట్లు విమానాన్ని పొలాల్లో అత్యవసరంగా దించే ప్రయత్నం చేయగా, అది అదుపుతప్పి కూలిపోయింది. ప్రమాద తీవ్రతకు విమానం ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో విమానంలో కెప్టెన్, ట్రైనీ పైలట్ ఇద్దరు మాత్రమే ఉన్నారు. సమాచారం అందుకున్న బాబలేశ్వర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో గాయపడిన ఇద్దరినీ అంబులెన్స్‌లో సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిని కెప్టెన్ కునాల్ మల్హోత్రా, ట్రైనీ పైలట్ గౌతమ్ శంకర్‌గా కొన్ని నివేదికలు చెబుతున్నప్పటికీ, ఈ వివరాలను అధికారులు ఇంకా అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. ప్రాథమికంగా ఇంజిన్ వైఫల్యమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. కాగా, విమానం కూలిపోవడానికి ముందే కెప్టెన్, ట్రైనీ పైలట్ దూకేసినట్టు తెలుస్తోంది.

## దెబ్బతిన్న ఎయిర్ బేస్‌లో పాక్ మరమ్మతులు

ఇస్లామాబాద్: భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ లో తమకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, తామే భారత విమానాలు కూల్చేశామని పాకిస్థాన్ ప్రగల్భాలు పలుకుతున్న సంగతి తెలిసిందే. వాస్తవాలను కప్పిపెట్టి ఆ దేశం చేస్తున్న ప్రకటనల్లోని డొల్లతనం మరోసారి బయటపడింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) యుద్ధవిమానాలు జరిపిన దాడిల్లో పాక్ లోని పలు ఎయిర్ బేస్ లు దెబ్బతిన్నాయి. ఇదే విషయాన్ని భారత్ ప్రపంచానికి వెల్లడించింది. పాక్ డ్రోన్ దాడులకు జవాబుగా మన వాయుసేన మే 10 న భొలారీ బేస్‌ను టార్గెట్ చేసి దాడులు జరిపింది. ఈ దాడిలో ఉపయోగించిన ఆయుధాల వివరాలను వెల్లడించనప్పటికీ.. ఎయిర్ బేస్ ను పాక్షికంగా దెబ్బతీశామని ప్రకటించింది. పాక్ మాత్రం ఈ వాదనను కొట్టిపారేసింది. అయితే, తాజాగా వెలుగుచూసిన ఉపగ్రహ చిత్రాల్లో భొలారి లోని పాక్ వాయుసేన స్థావరం దెబ్బతిన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాదు.. అందులోని దెబ్బతిన్న ఓ హ్యాంగర్ కు మరమ్మతులు చేయడం తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి 28న వాంటోర్ సంస్థకు చెందిన ఉపగ్రహాలు ఇక్కడ చిత్రాలను తీశాయి. ఆ సమయంలో ఎయిర్ బేస్‌లో దెబ్బతిన్న హ్యాంగర్‌కు పాక్ దళాలు మరమ్మతులు చేస్తున్నట్లు తేలింది.

## నేను ఎప్‌స్టీన్‌ను కలవలేదు: దలైలామా

సిమ్లా: ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్ స్టీన్ ఫైల్స్ లో బౌద్ధ మతగురువు దలైలామా పేరు పలుమార్లు ప్రస్తావనకు రావడం తెలిసిందే. అమెరికా న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసిన ఫైల్స్ లో ఏకంగా 169 చోట్ల దలైలామా పేరు కనిపించింది. ఈ విషయంపై నెలకొన్న అనుమానాలకు దలైలామా తాజాగా వివరణ ఇచ్చారు. ఎక్స్ వేదికగా మీడియా ప్రకటన విడుదల చేశారు. మహిళలు, మైనర్లపై లైంగిక నేరాలకు పాల్పడ్డ నిందితుడు జెఫ్రీ ఎప్ స్టీన్ ను తాను ఎన్నడూ కలవలేదని స్పష్టం చేశారు. ఎప్ స్టీన్ ఫైల్స్ లో తన పేరు ప్రస్తావన, తనపై వస్తున్న ఆరోపణలు అన్నీ నిరాధారమైనవని కొట్టిపారేశారు. ఎప్ స్టీన్ తో కానీ ఆయన ప్రతినిధులతో కానీ తాను ఎన్నడూ ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదని స్పష్టం చేశారు. ఇటీవల కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాలు, సోషల్ మీడియా పోస్టుల్లో జెఫ్రీ ఎఫ్ స్టీన్ తో దలైలామా సమావేశమైనట్లు చూపించడంపై దలైలామా ఆఫీసు అభ్యంతరం వ్యక్తం చేసింది. దలైలామాపై అసత్య ప్రచారం జరుగుతోందని ఆరోపించింది.

## తగ్గనున్న హార్లే డేవిడ్సన్ బైకుల ధరలు

న్యూఢిల్లీ: అమెరికా నుంచి దిగుమతయ్యే మోటారు సైకిళ్లపై భారత్ భారీగా సుంకాలను తగ్గించింది. భారత్ - అమెరికా మధ్య ఎట్టకేలకు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. 800 సీసీ నుంచి 1600 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన బైక్‌లపై ఇకపై ఎలాంటి దిగుమతి సుంకాలు ఉండబోవని అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో అమెరికా ప్రీమియం బైక్ తయారీ సంస్థ హార్లే డేవిడ్‌సన్‌కు ఈ ఒప్పందం పెద్ద ఊరటగా మారనుంది. ఇదివరకే హార్లే డేవిడ్‌సన్‌కు ప్రభుత్వం సుంకాల విషయంలో కొంత వెసులుబాటు కల్పించింది. గతేడాది 1600 సీసీ వరకు ఇంజిన్ సామర్థ్యం కలిగిన వాహనాలపై 50 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని 40 శాతానికి తగ్గించింది. అలాగే 1600 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం ఉన్న వాహనాలపై 50 శాతం సుంకాన్ని 30 శాతానికి కుదించింది. ఇక తాజాగా కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై భారత్ - అమెరికా ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. దీనిపై మార్చిలో అధికారికంగా సంతకాలు జరగనున్నాయి. ఒప్పందం అమలులోకి వచ్చిన తేదీ నుంచే కొత్త సుంకాల విధానం అమల్లోకి రానుంది. అమెరికా నుంచి దిగుమతయ్యే కార్లపై కూడా భారత్ సుంకాలను తగ్గించింది. 3000 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన పెట్రోల్, డీజిల్ వాహనాలపై 10 సంవత్సరాల పాటు 30 శాతం చొప్పున సుంకం వర్తించనుంది. అయితే ఎలక్ట్రిక్ కార్లను ఈ ట్రేడ్ డీల్ నుంచి మినహాయించారు. దీంతో టెస్లాకు ఈసారి పెద్దగా ఊరట లభించలేదు. టెస్లా విక్రయిస్తున్న మోడల్ వై కార్లపై టారిఫ్‌లు యథాతథంగా కొనసాగనున్నాయి. ఇది దేశీయ ఆటోమొబైల్ కంపెనీలైన టాటా, మహీంద్రాలకు మాత్రం ఊరట కలిగించే అంశంగా భావిస్తున్నారు.

## 'గల్వాన్' తర్వాతే చైనా అణుపరీక్ష

**అమెరికా సంచలన ఆరోపణ**

న్యూయార్క్: చైనా 2020లో రహస్యంగా అణుపరీక్ష నిర్వహించిందని అమెరికా సంచలన ఆరోపణలు చేసింది. భారత్‌తో గల్వాన్ లోయలో ఘర్షణలు జరిగిన సరిగ్గా వారం రోజుల తర్వాత, జూన్ 22, 2020న ఈ పరీక్ష జరిగిందని తొలిసారిగా బహిరంగంగా వెల్లడించింది. అయితే, ఈ ఆరోపణలను చైనా తీవ్రంగా ఖండించగా, అంతర్జాతీయ అణుపరీక్షల పర్యవేక్షణ సంస్థ కూడా అమెరికా వాదనకు విరుద్ధమైన ప్రకటన చేసింది. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరిగిన నిరాయుధీకరణ సదస్సులో అమెరికా అండర్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ థామస్ డినాన్నో శుక్రవారం ఈ ఆరోపణలు చేశారు. "చైనా అణు విస్ఫోటన పరీక్షలు నిర్వహించినట్లు అమెరికా ప్రభుత్వానికి తెలుసు. ప్రపంచం నుంచి తన కార్యకలాపాలను దాచిపెట్టడానికి 'డీకప్లింగ్' అనే సాంకేతికతను చైనా ఉపయోగించింది. 2020 జూన్ 22న అలాంటి ఒక పరీక్షను జరిపింది" అని ఆయన తెలిపారు. భూగర్భంలో పెద్ద ఖాళీ ప్రదేశంలో అణుపరీక్ష జరపడం ద్వారా భూకంప తరంగాలను తగ్గించి, పసిగట్టకుండా చేయడాన్నే డీకప్లింగ్ అంటారు. అమెరికా, రష్యా మధ్య కీలకమైన 'న్యూ స్టార్ట్' అణు ఒప్పందం ఇటీవల ముగిసిన నేపథ్యంలో ఈ ఆరోపణలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భవిష్యత్తులో అణ్వస్త్ర నియంత్రణ ఒప్పందాల్లో చైనాను కూడా భాగం చేయాలని అమెరికా భావిస్తోంది. ఈ క్రమంలోనే ఒత్తిడి పెంచేందుకు ఈ ఆరోపణలు చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా ఆరోపణలపై చైనా తీవ్రంగా స్పందించింది. ఇవన్నీ నిరాధారమైన కథనాలని, ఆయుధ పోటీని పెంచుతున్నది అమెరికానే అని చైనా రాయబారి షెన్ జియాన్ విమర్శించారు. మరోవైపు, అణుపరీక్షలను పర్యవేక్షించే అంతర్జాతీయ సంస్థ సీటీబీటీవో కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. 2020 జూన్ 22న చైనాలో అణుపరీక్షకు సంబంధించిన ఎలాంటి కార్యకలాపాలను తమ వ్యవస్థలు గుర్తించలేదని స్పష్టం చేసింది. దీంతో ఈ వివాదం మరింత సంక్లిష్టంగా మారింది.

లవ్లీ చిత్రం


ఖుషీ కపూర్



# ఒకే వేదికపై జగన్, విజయ్

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెన్నై పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. జగన్ సోదరుడు వైఎస్ సునీల్ రెడ్డి కుమారుడి వివాహ వేడుకకు హాజరైన ఆయన, అక్కడ తమిళనాడు రాజకీయ, సినీ ప్రముఖులతో ఆత్మీయంగా గడిపారు. ఈ వేడుకలో తమిళగ వెట్రి కళగం అధినేత, నటుడు దళపతి విజయ్‌తో జగన్ ముచ్చటించిన దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కొత్తగా రాజకీయ పార్టీ స్థాపించి తమిళనాట సంచలనం సృష్టిస్తున్న టీవీకే అధినేత విజయ్, వైఎస్ జగన్ పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఇద్దరు అగ్ర నేతలు రాజకీయ పరిణామాల గురించి చర్చించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. అభిమానులు వీరిద్దరినీ చూసి "జన నాయకుడితో జన నాయగన్" (ప్రజల నాయకుడితో ప్రజల హీరో) అంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు.

# మా డబ్బు మా ఇష్టం



టాలీవుడ్ సీనియర్ నటి సురేఖావాణి గారాల పట్టి సుప్రిత, వెండితెరపైకి అడుగుపెట్టక ముందే సోషల్ మీడియాలో స్టార్‌గా ఎదిగింది. తన గ్లామరస్ ఫొటోలు, స్టైలిష్ వీడియోలతో నిత్యం నెటిజన్లను ఆకట్టుకునే ఈ భామ, త్వరలోనే హీరోయిన్‌గా ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతోంది. అయితే, ఒకవైపు అభిమానం వెల్లువెత్తుతున్నా, మరోవైపు ఆమెపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ కూడా అదే స్థాయిలో జరుగుతోంది. ముఖ్యంగా ఆమె ధరించే దుస్తులు, తల్లితో కలిసి వెళ్లే వెకేషన్స్‌పై కొందరు నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా.. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సుప్రిత, తనపై వస్తున్న ఈ విమర్శలపై అత్యంత ఘాటుగా స్పందించింది. ట్రోలర్లకు గట్టి కౌంటర్ ఇస్తూ తనలోని ఆవేదనను బయటపెట్టింది. "నేను నా కష్టార్జితంతో సంపాదించిన డబ్బులతో మా అమ్మను వెకేషన్స్‌కు తీసుకెళ్తున్నాను. నా తల్లిని సంతోషంగా ఉంచడానికి నేను ప్రయత్నిస్తుంటే, కొందరు ఎందుకు అంత కుళ్లు చూపిస్తున్నారు అర్థం కావడం లేదు. మేము ట్రిప్పులకు వెళ్తే ట్రోల్ చేసే వారికి అసలు సమస్య ఏంటో తెలియట్లేదు. డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయని అడుగుతారు. నేను ఐటీ రిటర్న్ కూడా వేస్తాను. మేము వెళ్లి లక్షలు లక్షలు ఖర్చుపెట్టము. సంపాదించిన దాంట్లోనే కొంత వెకేషన్లకు ఖర్చుపెడతాం. చాలామంది ట్రిప్పులకు వెళ్తారు కానీ మా మీదనే అందరి ఫోకస్ ఉంటుంది. అలాంటి కామెంట్లు చూసి చాలా ఏడ్చాను. కాళీగా కూర్చొని కామెంట్లు చేసేవాళ్లకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. నేను పని చేసుకోవాలి కాబట్టి పట్టించుకోను" అంటూ ఫైర్ అయింది.



### మా అమ్మకు రెండో పెళ్లి చేస్తా

తన తల్లి రెండో పెళ్లిపై సుప్రిత సంచలన నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 'మా అమ్మకు ఒక తోడు ఉండాలని నేను బలంగా కోరుకుంటున్నాను. భవిష్యత్తులో నేను పెళ్లి చేసుకుని వెళ్ళిపోతే ఆమె ఒంటరి అయిపోతుంది. అందుకే అమ్మకు రెండో పెళ్లి చేసిన తర్వాతే నేను పెళ్లి చేసుకుంటాను' అని తెలిపి అందరినీ ఆశ్చర్యపరిచింది. తన తల్లి రెండో పెళ్లి విషయంలో ఇప్పటికే తన మేనమామలతో కూడా మాట్లాడానని, అమ్మకు మంచి తోడును వెతికే బాధ్యత తనదేనని ఆమె స్పష్టం చేసింది.

# యువతకు మార్గదర్శకం 'రుద్ర': చిరంజీవి



'రుద్ర' గ్రంథాన్ని మెగాస్టార్ చిరంజీవి ఆవిష్కరించారు. శివ పురాణంపై యువతకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 'రుద్ర' పుస్తకాన్ని మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుస్మిత పటేల్ రచించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా మంత్రి కొండా సురేఖ వివరాలు పోస్ట్ చేశారు. నేటి యువతకు ఆదర్శంగా నిలిచేలా, శివ పురాణంపై అవగాహన కలిగించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ పుస్తకాన్ని రచించిన కొండా సుస్మితాకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి విలువైన పుస్తకాన్ని నేటి యువతరానికి అందించడం నిజంగా ప్రశంసనీయం అని, భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని గొప్ప రచనలను అందించాలని ఆకాంక్షించారు. "రుద్ర" పుస్తకాన్ని ఆవిష్కరించిన మెగాస్టార్ చిరంజీవికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పుస్తక ఆవిష్కరణపై మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని యువతకు చేరువ చేసేలా పుస్తకం రూపొందించడం చాలా సంతోషం అని మెగాస్టార్ హర్షం వ్యక్తం చేశారు. నేటి తరానికి ఇలాంటి విలువైన గ్రంథాలు అవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు.

# శాండల్‌వుడ్‌పై మీనాక్షి ఫోకస్



మీనాక్షి చౌదరికి ప్రస్తుతం చేతిలో ఉంది ఒకటే సినిమా. ఇందులో యువ సామ్రాట్ నాగచైతన్యకు జోడీగా నటిస్తోంది. ఈ చిత్రం మినహా కొత్త ప్రాజెక్టే ఏది చేతిలో లేదు. ఈ సినిమా విజయం సాధించినా? వెంటనే మరో సినిమాకు సైన్ చేసే గ్యారెంటీ కూడా కనిపిం చడం లేదు. ఇవన్నీ అమ్మడు ముందుగానే గెస్ చేసిందో ఏమోగానీ తాజాగా మీనాక్షి చౌదరి ఫోకస్ శాండిల్ వుడ్ పై మళ్లించినట్లు కనిపిస్తోంది. కన్నడ స్టార్ రక్షిత్ హీరోగా నటించనున్న సినిమాలో హీరోయిన్ ఛాన్స్ అందుకుందని వార్తలొస్తున్నాయి. కిరణ్. రాజ్. కె ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. గతంలో ఇద్దరి కాంబినేషన్ లో రిలీజ్ అయిన -777చార్లీ- భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. కన్నడలో మరో 100 కోట్లు రాబట్టిన చిత్రాల జాబితాలో చార్లీ నిలిచింది. ఈ నేపథ్యంలోనే రక్షిత్ తో మరోప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్నాడు. ఇందులో హీరోయిన్ గా తొలుత కన్నడ నటినే తీసుకో వాలనుకున్నారు. కానీ మీనాక్షి చౌదరి ఆ పాత్రకు పర్ఫెక్ట్ గా సూటవ్వడంతో ఆమెని ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. మీనాక్షికి సరైన సమయంలో వస్తోన్న అవకాశం ఇది.

## సాయి ధన్సిక.. సెల్ఫ్ డిఫెన్స్‌లో క్వీన్

కోలీవుడ్ స్టార్ విశాల్ పెళ్లి చేసుకుంటున్న అమ్మాయి.. సాయి ధన్సిక. క్రేజీ హీరోయిన్ గా ఒక వెలుగు వెలుగుతున్న సాయి ధన్సిక చిన్నతనంలోనే అథ్లెట్ కావాలనుకుందట. అందులో భాగంగానే స్కూలు ఫుట్బాల్ టీమ్ కి కెప్టెన్ గా వ్యవహరించింది. దాదాపు పలు కాంపిటీషన్లో పాల్గొని సుమారుగా 15 పథకాలను కూడా అందుకుంది. అంతేకాదు ఈమెకు సెల్ఫ్ డిఫెన్స్ లో మంచి పట్టు కూడా ఉంది. ఇదే విషయాన్ని ఇటీవల ఒక ప్రమోషనల్ ఇంటర్వ్యూలో చెబుతూ.. యోగి డా సినిమా షూటింగ్స్ సమయంలో ఒక వ్యక్తి నాతో సెల్ఫీ దిగాలని.. మా అంకుల్ని అడిగితే ..ఆ వ్యక్తి తాగి ఉన్నాడని గమనించి.. మా అంకుల్ ఒప్పుకోలేదట. అయితే మా అంకుల్ ని కొట్టి ఆ వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేయడంతో.. సుమారు పది నిమిషాల పాటు ఆ తాగుబోతును చితక్కొట్టాను. అటు దర్శకుడు, హీరో నన్ను కంట్రోల్ చేసేందుకు ప్రయత్నించారు. అయితే నాకు సెల్ఫ్ డిఫెన్స్ కోసం నేను స్పెషల్ ట్రైనింగ్ కూడా తీసుకున్నాను.. ఆ టాలెంట్ అంతా అప్పుడు ఉపయోగించాను అంటూ చెప్పుకొచ్చింది.

# కిడ్నాప్ కేసులో విష్ణుకు నోటీసులు



మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రముఖ హీరో మంచు విష్ణుకి తిరుచానూరు పోలీసులు కిడ్నాప్ కేసులో నోటీసులు పంపించడం సంచలనంగా మారింది. అయితే దీనిపై మంచు విష్ణు స్పందిస్తూ 15 రోజుల్లోగా విచారణకు హాజరవుతానని స్పష్టం చేశారు. వివరాలలోకి వెళ్తే.. తిరుపతిలోని మంచు మోహన్ బాబు యూనివర్సిటీలో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు కాలేజీ వద్ద నిరసనలకు దిగారు. దీంతో అక్కడ పెద్ద రచ్చ జరిగింది. ఇక మోహన్ బాబు యూనివర్సిటీ.. ఫీజులు పేరిట విద్యార్థులను భారీగా దోచుకుంటున్నారని, ఎస్ఎఫ్ఐ నేతలు కలెక్టరేట్ ముట్టడికి సిద్ధం అవ్వడంతో మోహన్ బాబు బౌన్సర్లు ఇద్దరు విద్యార్థి నేతలను బలవంతంగా కారులో ఎక్కించుకొని తీసుకెళ్లారని.. అందులో అక్బర్, వినోద్ లపై బౌన్సర్లు దాడులు చేశారని ఆరోపిస్తూ.. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా... విద్యార్థి నేతలను కిడ్నాప్ చేశారనే ఆరోపణలతో పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసారు. ఈ క్రమంలోనే రంగంలోకి దిగిన పోలీసులు ఆ కార్ ను వెంబడించి ఘటనకు కారణమైన పలువురిపై కేసుల్ని నమోదు చేసినట్లు సమాచారం. ఇందులో మోహన్ బాబు, మంచు విష్ణు, పీఆర్ఓ సతీష్ తో సహా మొత్తం 13 మందిపై ఫిబ్రవరి 3వ తేదీన కిడ్నాప్ కేసు నమోదు అయింది.

# మంచు లక్ష్మి చేదు అనుభవం



చెన్నైలోని గ్రీన్ పార్క్ హోటల్‌లో తనకు ఎదురైన చేదు అనుభవంపై మంచు లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. వివరాల్లోకెళితే.. మంచు లక్ష్మి ఒక సినిమా ప్రమోషన్ కోసం చెన్నై వెళ్లినప్పుడు గ్రీన్ పార్క్ హోటల్‌లో రూమ్ తీసుకున్నారు. ఆమె తనతో పాటు తన కెమెరామెన్‌ను లోపలికి తీసుకెళ్లగా, హోటల్ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారు. హోటల్ రూమ్‌లోకి కెమెరాలను అనుమతించబోమని రిసెప్షనిస్ట్ చెప్పడంతో వాగ్వాదం జరిగింది. ఈ హోటల్ స్టాండార్డ్స్ ని మెచ్చుకున్న మంచు లక్ష్మి తనకు ఎదురైన ఇబ్బంది గురించి సిబ్బందిపై విరుచుకుపడ్డారు. తాను ప్రపంచవ్యాప్తంగా ఎన్నో హోటళ్లకు వెళ్లానని, ఎక్కడా ఇలాంటి నిబంధనలు చూడలేదని మంచు లక్ష్మి ఈ వీడియోలో పేర్కొన్నారు. కనీసం చిన్న కెమెరాను కూడా అనుమతించకపోగా.. సిబ్బంది ప్రవర్తనపై సోషల్ మీడియాలో వీడియో ద్వారా అసహనం వ్యక్తం చేశారు. కనీసం కెమెరామెన్ కోసం వేరొక రూమ్ అడిగినా దానికి సహకరించలేదని కూడా మంచు లక్ష్మి ఆవేదన చెందారు.





# స్వదేశానికి పిలగాండ్లు

## ముంబై విమానాశ్రయంలో జగజ్జేతలకు ఘన స్వాగతం

అండర్ -19 వన్డే ప్రపంచకప్ విజేత భారత జట్టు సగర్వంగా స్వదేశంలో అడుగుపెట్టింది. ఆరోసారి రికార్డు టైటిల్‌తో యావత్ భారతావని గర్వపడేలా చేసిన ఆయుశ్ మాత్రే బృందం ఆదివారం ముంబై విమానాశ్రయంలో దిగింది. జగజ్జేతలుగా తిరిగొచ్చిన టీమిండియా క్రికెటర్లకు కుటుంబ సభ్యులు, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది, అభిమానులు ఘన స్వాగతం పలికారు. సొంతగడ్డపై తమను ఘనంగా ఆహ్వానించడంపై యువ క్రికెటర్లు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. అండర్ -19 ఛాంపియన్లుగా స్వదేశం విచ్చేసిన భారత క్రికెటర్లను చూసి కుటుంబసభ్యులు పొంగిపోయారు. టీమిండియా విజయంలో కీలకమైన కెప్టెన్ ఆయుశ్ మాత్రే, వైభవ్ సూర్యవంశీ, అభిగ్యాన్ కుందు, హెనిల్ పటేల్ ముంబై విమానాశ్రయం చేరుకున్నారు. వారిని చూసేందుకు మీడియా, అభిమానులు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా.. మీడియావాళ్లైతే విశ్వవిజేతలను మాట్లాడించేందుకు పోటీపడ్డారు. పేసర్ హెనిల్ పటేల్ మాట్లాడుతూ.. దేశం కోసం వరల్డ్‌కప్ గెలవాలని అందరం లక్ష్యంగా పెట్టుకున్నాం. అనుకున్నట్టే సాధించాం. నా తదుపరి లక్ష్యం సీనియర్ జట్టుకు ఆడడమే అని చెప్పాడు. వికెట్ కీపర్ అభిగ్యాన్ కుందు స్పందిస్తూ.. ప్రపంచకప్ గెలిచినందుకు తమకు ఎంతో గర్వంగా ఉందని అన్నాడు. ఇక కెప్టెన్ ఆయుష్ మాత్రే తండ్రి యోగేశ్ కమలాకర్ మాత్రే పట్టలేనంత సంతోషంగా ఉందన్నాడు. అండర్-19 ప్రంపచకప్ గెలుపొందడం ద్వారా ఆయుశ్ దేశమంతా గర్వపడేలా చేశాడు అని ఆయన పేర్కొన్నాడు.

# సూర్య పరుగులు ప్రత్యేకం: అశ్విన్

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా యూఎస్‌ఏతో శనివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ (ాబతీఝుఎబఝుతీ్ఘఝుజ) జట్టును ఓటమి నుంచి కాపాడాడు. కష్ట సమయంలో తనదైన శైలిలో బ్యాటింగ్ చేసి.. 49 బంతుల్లో 84 పరుగులతో అజేయంగా నిలిచాడు. మొత్తం భారత జట్టు స్కోర్‌లో 52 శాతం పరుగులు సూర్య బ్యాట్ నుంచే రావడం విశేషం. భారత్ 77/6 స్థితి నుంచి 161 పరుగులకు చేరడంలో, జట్టు విజయం సాధించడంలో సూర్య కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ అనంతరం భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సూర్య ఇన్నింగ్స్‌పై ప్రశంసలు కురిపించాడు. గతేడాది నిరాశాజనక ఫామ్ తర్వాత సూర్య.. తిరిగి ఫామ్‌లోకి వచ్చాడని కొనియాడాడు. సూర్య.. వికెట్ల వెనుక నుంచి పరుగులు రాబట్టడం ఈ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని చెప్పాడు. తన యూట్యూబ్ ఛానల్ 'యాష్ కి బాత్' కార్యక్రమంలో అశ్విన్ మాట్లాడాడు. "మొదట అమెరికా జట్టును అభినందించాల్సిందే. వాంఖడే స్టేడియం లాంటి సాధారణ బ్యాటింగ్‌కు అనుకూలమైన మైదానంలోనూ ఆ జట్టు బౌలర్లు సరైన ప్రణాళికతో వచ్చారు. షాడ్లీ వేగంగా బంతులు వేయలేదు. కానీ, కట్టర్లు.. వేరియంట్స్‌తో బౌలింగ్ చేశాడు. సూర్య కోసం ప్రత్యేక ప్రణాళికతో బౌలింగ్ చేసినట్లు అర్థమవుతుంది. సూర్య క్రీజులోకి వచ్చాక మొదట ఆచితూచి ఆడాడు. పరుగులు తీసేందుకు కొంత ఇబ్బంది పడ్డాడు. 31 బంతుల్లో 45 పరుగులు చేయగలిగాడు. డెత్ ఓవర్లలో విజృంభించి.. 16 బంతుల్లోనే 38 పరుగులు రాబట్టాడు. అమెరికా జట్టులో ఉత్తమ బౌలరైన సౌరభ్ నేత్రావల్కర్‌ను ధైర్యంగా ఎదుర్కొన్నాడు. సూర్య చేసిన పరుగుల్లో 37 శాతం స్కోర్ వికెట్ల వెనుక నుంచే రావడం విశేషం. ఇది నిజమైన 360 డిగ్రీ మాస్టర్ క్లాస్ బ్యాటింగ్. గతంలో కొన్ని జట్లు ఆ ఏరియాలోనే సూర్యని కట్టడి చేశాయి. కానీ, ఈ మ్యాచ్‌లో అతడు సమయం తీసుకున్నా.. మంచి ఫామ్‌లోకి వచ్చాడు. కెప్టెన్‌గా అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు"అని అశ్విన్ తెలిపాడు.



# టీమిండియా ఇంకా నేర్చుకోవాలి: గావస్కర్

భారత్ మరింత మెరుగ్గా తన బ్యాటింగ్ ప్రణాళికలను రూపొందించుకోవాలని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సునీల్‌గావస్కర్ సూచించాడు. 'నా దృష్టిలో 160 స్కోర్ చేయడం తేలిక కాదు. టీమ్‌ఇండియా మంచి మార్జిన్‌తోనే (29 పరుగులు) గెలిచింది. అయితే భారతజట్టు ఈ మ్యాచ్ నుంచి చాలా నేర్చుకోవాలి. బ్యాటింగ్ డెప్త్ ఉంది. కానీ పవర్‌ప్లేలో తేలిగ్గా వికెట్లు సమర్పించుకోవడం సమంజసం కాదు' అని సునీల్ గావస్కర్ పేర్కొన్నాడు. 'ఎనిమిది మంది బ్యాటర్లతో భారత్ బరిలోకి దిగితే, ముగ్గురు మాత్రమే బౌలర్లుంటారు. 7 - 8 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోతే జట్టుకు పెద్ద సమస్య అవుతుంది. పవర్‌ప్లే ఆరు ఓవర్లు ఉంటుందనేది వాస్తవమే. కానీ జట్టులో.. ఎనిమిది మంది బ్యాటర్లుంటే అందులో నలుగురి వికెట్లను పవర్‌ప్లేలోనే కోల్పోవడం కరెక్ట్ కాదు. అలా అయితే మనల్ని మనమే ఒత్తిడిలోకి నెట్టుకున్నట్లవుతుంది' అని సునీల్ గావస్కర్ విశ్లేషించాడు.

# గంభీర్-కోహ్లీ మధ్య విభేదాల్లేవ్: బీసీసీఐ

ప్రస్తుత భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీల సఖ్యతపై ఎప్పటి నుంచో పెద్ద చర్చే సాగుతోంది. ఐపీఎల్‌లో చోటు చేసుకున్న ఘర్షణల అనంతరం వీరిద్దరి మధ్య విభేదాలున్నాయని గట్టిగానే ప్రచారం జరిగింది. గంభీర్ టీమ్‌ఇండియా హెడ్ కోచ్‌గా మారిన తర్వాత మొదట్లో సవ్యంగానే ఉందనిపించినా.. ఇద్దరు కలిసి మాట్లాడుకోకపోవడం, ఒకరినొకరు పట్టించుకోకపోవడం వంటివి జరిగాయి. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. అయితే, ఈ అంశంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తొలిసారిగా స్పందించారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. గంభీర్, కోహ్లీ మధ్య ఎలాంటి గొడవలు లేవని, వారు గొడవ పడటం తాను ఎప్పుడూ చూడలేదని అన్నారు. వారిద్దరి మధ్య మంచి స్నేహపూర్వక బంధం ఉందన్నారు. కోహ్లీని గంభీర్ వన్డే జట్టు నుంచి తప్పించాలని చూస్తున్నాడన్న ప్రచారాన్ని సైకియా ఖండించారు. అలాంటి అభిప్రాయం కొందరిలో ఉండొచ్చన్నారు. అయితే, కోహ్లీ ఎప్పుడూ జట్టులోనే ఉన్నాడని, గంభీర్ కూడా జట్టుతోనే ఉన్నాడని తెలిపారు. ఆ ప్రచారంలో నిజం లేదని వెల్లడించారు. కోహ్లీని టెస్టు క్రికెట్ నుంచి బలవంతంగా రిటైర్ చేయించారనే ఊహాగానాలు అప్పట్లో వచ్చాయి.



# ఇంగ్లండ్‌కు నేపాల్ చుక్కలు

## కానీ.. చివరికి ఇంగ్లిష్ జట్టు విజయం

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టుకు నేపాల్ చుక్కలు చూపించింది. పసికూన నేపాల్ అద్భుత పోరాట పటిమను కనబరిచినప్పటికీ.. చివరి బంతి వరకు సాగిన ఈ ఉత్కంఠ పోరులో ఇంగ్లాండ్ కేవలం 4 పరుగుల తేడాతో గట్టెక్కింది. సామ్ కరన్ ఆఖరి ఓవర్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి ఇంగ్లాండ్‌ను పరాభవం నుంచి కాపాడారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ జట్టుకు ఆరంభంలోనే నేపాల్ బౌలర్లు షాకిచ్చారు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (1) త్వరగానే ఔట్ కాగా.. కెప్టెన్ జోస్ బట్లర్ (26) కాసేపు మెరిసి వెనుదిరిగాడు. 57 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన కష్టాల్లో ఉన్న ఇంగ్లాండ్‌ను జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్ ఆదుకున్నారు. బెథెల్ (55 పరుగులు, 35 బంతుల్లో), హ్యారీ బ్రూక్ (53 పరుగులు, 32 బంతుల్లో) అర్ధ సెంచరీలతో రాణించారు. చివర్లో విల్ జాక్స్ కేవలం 18 బంతుల్లో 39 పరుగులు చేయడంతో ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేయగలిగింది. అనంతరం 185 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ ఏమాత్రం బెదరలేదు. ఓపెనర్ కుశాల్ భుర్తెల్ (29) జోఫ్రా ఆర్చర్ ఓవర్‌లో వరుసగా మూడు ఫోర్లు బాది ఇంగ్లాండ్‌కు హెచ్చరికలు పంపాడు. ఆ తర్వాత కెప్టెన్ రోహిత్ పౌడెల్ (39), దిపేంద్ర సింగ్ ఐరీ (44 పరుగులు, 29 బంతుల్లో) ఇంగ్లాండ్ స్పిన్నర్లను ఉతికి ఆరేశారు. అదిల్ రషీద్ వేసిన ఒకే ఓవర్‌లో 19 పరుగులు రావడంతో వాంఖడే మైదానం నేపాల్ అభిమానుల కేకలతో మారుమోగిపోయింది. చివరి 3 ఓవర్లలో నేపాల్ విజయానికి 38 పరుగులు అవసరమైన దశలో లోకేష్ బామ్ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. దీంతో సమీకరణం చివరి ఓవర్‌లో 10 పరుగులకు చేరుకుంది. సామ్ కరన్ వేసిన ఆఖరి ఓవర్‌లో మొదటి ఐదు బంతులు చాలా కట్టుదిట్టంగా పడ్డాయి. చివరి బంతికి 6 పరుగులు అవసరమైన సమయంలో లోకేష్ బామ్ కేవలం ఒక్క పరుగు మాత్రమే తీయగలిగాడు. ఫలితంగా నేపాల్ 180 పరుగుల వద్ద నిలిచిపోయింది. ఇంగ్లాండ్ 4 పరుగుల తేడాతో అతికష్టం మీద విజయాన్ని అందుకుంది.

# శ్రీలంక శుభారంభం

### ఐర్లాండ్‌పై విజయం



టీ20 ప్రపంచకప్‌లో శ్రీలంక శుభారంభం చేసింది. కొలంబో వేదికగా ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనకు దిగిన ఐర్లాండ్ 19.5 ఓవర్లలో 143 పరుగులకు ఆలౌటైంది. రాస్ అదైర్ (34), హ్యారీ టెక్టార్ (40), టకెర్ (21) మినహా మిగతా వారెవరూ పెద్దగా రాణించలేదు. శ్రీలంక బౌలర్లలో మహీశ్ తీక్షణ, హసరంగ చెరో 3 వికెట్లు పడగొట్టగా పతిరణ 2, చామీర, దునిత్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక ప్రత్యర్థి జట్టుకు మంచి లక్ష్యాన్నే నిర్దేశించింది. కుశాల్ మెండిస్ (56) అర్ధశతకంతో మెరిశాడు. కమిందు మెండిస్ (44), పథుమ్ నిశ్శంక (24) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఐర్లాండ్ బౌలర్లలో మెక్‌కర్తీ, డాక్రెల్ చెరో 2 వికెట్లు పడగొట్టగా, మార్క్ అదైర్, డెలానీ ఒక్కో వికెట్ తీశారు.

# అఫ్ఘనిస్తాన్‌పై కివీస్ గెలుపు

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరిత పోరులో న్యూజిలాండ్ జట్టు అద్భుత విజయాన్ని సాధించింది. ఆఫ్ఘనిస్తాన్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని కివీస్ వేటగాళ్లు రికార్డు స్థాయిలో ఛేదించారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు కివీస్ బౌలర్లు ఆరంభంలోనే షాకిచ్చారు. ఇన్నింగ్స్ నిలకడగా సాగుతున్న సమయంలో ఓపెనర్లు రహ్మానుల్లా గుర్బాజ్ (27), ఇబ్రహీం జద్రాన్ (10) తక్కువ వ్యవధిలోనే పెవిలియన్ చేరారు. పవర్‌ప్లే ముగిసే సమయానికి ఆఫ్ఘన్ జట్టు 44 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే మూడో స్థానంలో వచ్చిన గుల్బదిన్ నైబ్ కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 35 బంతుల్లో 3 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 63 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతనికి తోడుగా సెదికుల్లా అటల్ (29) బాధ్యతాయుతంగా ఆడటంతో ఆఫ్ఘనిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగుల భారీ స్కోరు సాధించింది. 183 పరుగుల కఠినమైన లక్ష్యంతో బరిలోకి దిగిన




న్యూజిలాండ్‌కు రెండో ఓవర్లోనే ఆఫ్ఘన్ స్పిన్నర్ ముజీబ్ ఉర్ రహ్మాన్ చుక్కలు చూపించాడు. వరుస బంతుల్లో ఫిన్ అలెన్ (1), రచిన్ రవీంద్ర (0)లను అవుట్ చేసి కివీస్‌ను 14 పరుగులకే 2 వికెట్ల నష్టంతో ఆత్మరక్షణలో నెట్టాడు. ఈ క్లిష్ట సమయంలో టిమ్ సిఫెర్ట్, గ్లెన్ ఫిలిప్స్ జోడి ఇన్నింగ్స్‌ను అద్భుతంగా నిర్మించింది. సీఫెర్ట్ కేవలం 42 బంతుల్లో 65 పరుగులు (7 ఫోర్లు, 3 సిక్సర్లు) చేసి జట్టును విజయపథంలో నడిపించాడు. ఫిలిప్స్ కూడా 25 బంతుల్లో 42 పరుగులతో మెరుపులు మెరిపించడంతో కివీస్ ఇన్నింగ్స్ ఊపందుకుంది. వీరిద్దరూ మూడో వికెట్‌కు 74 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మిడిల్ ఓవర్లలో రషీద్ ఖాన్, ముజీబ్‌లు వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచినప్పటికీ, కివీస్ బ్యాటర్లు ఏమాత్రం తగ్గలేదు. మార్క్ చాప్‌మన్ (28) విలువైన పరుగులు జోడించగా.. చివర్లో డారిల్ మిచెల్ (25 నాటౌట్), కెప్టెన్ మిచెల్ సాంట్నర్ (17 నాటౌట్) బాధ్యతాయుతమైన ఆట తీరును ప్రదర్శించారు. కివీస్ మరో 13 బంతులు మిగిలి ఉండగానే 17.5 ఓవర్లలో లక్ష్యాన్ని చేరుకుంది. టీ20 ఇంటర్నేషనల్ క్రికెట్‌లో 175 కంటే ఎక్కువ పరుగులు చేసిన తర్వాత ఆఫ్ఘనిస్తాన్ ఓడిపోవడం ఇదే తొలిసారి. అలాగే ఆఫ్ఘన్‌పై టీ20ల్లో ఇదే అత్యంత విజయవంతమైన రన్ చేజ్ (183)గా రికార్డులకు ఎక్కింది.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
సోమవారం 9-2-2026



మొదటి భాగం

ఒక కుటుంబం.. అన్నదమ్ముల మధ్య అధికార తగాదా, చిలికి చిలికి గాలివానగా మారింది. అన్న భార్యను తమ్ముడు అవమానించాడు.. ఇంకేం యుద్ధమేఘాలు కమ్ముకు న్నాయి. ఇరువర్గాలూ రణరంగానికి సర్వం సన్నద్ధమయ్యాయి. అధికారం అన్నదమ్ముల మధ్య చిచ్చు పెట్టింది. అహంకారం పగల్ని రగిల్చింది. మహా మారణహోమాన్ని సృష్టించింది.. ప్రపంచ నాగరిక చరిత్రలో కనీవినీ ఎరుగని సామూహిక జనహననం అది. ఒక కుటుంబం కోసం ఒక దేశం బలైపోయింది. రాజరికపు దుష్టజూదానికి సామంత రాజ్యాలు హరించుకుపోయాయి. మాయదారి యుద్ధం లక్షల మందిని పొట్టన పెట్టుకుంది. ఇదంతా అయిదున్నర వేల సంవత్సరాల క్రితం జరిగిన కథ.. మన దేశంలోనే జరిగిన కథ. ఇన్ని వేల సంవత్సరాల తరువాత కూడా ఇప్పటి రాజకీయ వ్యవస్థ సైతం అనుసరిస్తున్న రాజనీతిని అందించిన చరిత్ర.

# మహా భారత యుద్ధం.. ఆ 18 రోజులు!



ఇది మహాభారత గాథ.. అయిదుగురు పాండవులు, నూరుగురు కౌరవులను అతి తేలిగ్గా ఓడించిన ఇతిహాసం. తమ రాజ్యాధికారాన్ని అన్యాయంగా స్వాధీనం చేసుకున్న కౌరవులపై పాండవులు ప్రతీకారం తీర్చుకున్న కథ. తమ భార్యను పదిమందిలో వివస్త్రను చేసేందుకు యత్నించిన దుర్మార్గులను పాండవులు మట్టుబెట్టిన కథ. వార్ హెడ్ విమానాలు.. వైమానిక దాడులు.. జీవరసాయన ఆయుధాలు.. అణ్వస్త్ర ప్రయోగాలు. రోజుకు రెండు లక్షల మంది..18 రోజుల్లో 36 లక్షల మంది.. మహా మారణ హోమంలో సామూహిక జన హననం.. ప్రళయాన్ని సృష్టించిన మహా యుద్ధం.. కురుక్షేత్రం. తొలి ప్రపంచ సంగ్రామం ఎక్కడ జరిగిందో తెలుసా? 1914 అని జికె తెలిసిన కుర్రోళ్లు ఠక్కున చెప్పేస్తారు.. కానీ, అది తప్పు.. ముమ్మాటికీ తప్పే.. మొదటి ప్రపంచ సంగ్రామం క్రీస్తుపూర్వం 3138లో జరిగింది. అదీ మన దేశంలో, భారత

ఉపఖండంలో– రెండు కుటుంబాల మధ్య జరిగిన యుద్ధం, రెండు ప్రపంచ సంగ్రామాల కంటే దారుణమైన వినాశనాన్ని సృష్టించింది. అంతకు ముందు, ఆ తరువాత, ఇవాల్టికి సైతం కనీవినీ ఎరుగని బాంబు పేలుళ్లతో ప్రళయాన్ని సృష్టించిన మహా సంగ్రామానికి మనమే వారసులం. కేవలం 18 రోజుల్లో మానవ సమూహమే నాశనమైపోయింది. మానవ జాతికి మరపునకు రాని చరిత్రను అందించిన మహాయుద్ధం అది. దాయాదుల మధ్య అధికార కాంక్షతో అంతులేని మారణకాండ జరిగిపోయింది. క్రీస్తు పూర్వం 3138, డిసెంబర్ 25, మంగళవారం, మార్గశిర మాసం, శుక్లపక్షం, త్రయోదశి మహా సంగ్రామానికి ముహూర్తం కుదిరింది. ఈ ముహూర్త బలం వల్లనేమో 18 రోజుల్లో 36 లక్షల మంది హతమయ్యారు. ఈ యుద్ధంలో అత్యాధునిక ఆయుధాలు ఉపయోగించారు. అణ్వస్త్రాలు, జీవ రసాయనాయుధాలు, ఎయిర్ బ్యాటిల్, ఈనాటి అగ్రరాజ్యాలను సైతం నివ్వెరపరిచే ఆధునిక యుద్ధ తంత్రాలు ప్రయోగించారు. నేటి ప్రపంచానికి యుద్ధ నీతిని అందించిన మహారణం ఈ కురుక్షేత్రం. అణ్వస్త్రం.. అమెరికా వాడు తయారు చేశాడు.. చంద్రుడి మీదకు అమెరికా వాడు ముందు వెళ్లాడు.. యుద్ధం చేయటం అమెరికా వాడికే తెలుసు.. ప్రజాస్వామ్యం అమెరికా నుంచి నేర్చుకోవాలి.. నియంతృత్వం అమెరికా నుంచే తెలుసుకోవాలి.. పసుపుపై పేటెంటు అమెరికాదే.. ప్రపంచంపై పేటెంటు అమెరికాదే.. ప్రపంచ పోలీసు సర్వాంతర్యామి.. మనది కొంచెం తెలివైతే.. వాడిది అతి తెలివి.. ఇదంతా దేనికని అనుకోకండి.. ఇప్పు డున్న ట్రెండ్ అలాంటిది.. ప్రపంచంలో అన్నీ అమెరికాలోనే పుట్టాయనుకునే జనరేషన్ మనది.. కానీ, సోకాల్డ్ అమెరికా వంటి ప్రపంచ దేశాలన్నింటికీ మించిన సాఫిస్టికేటెడ్ టెక్నాలజీలో మనం ఎంతో ముందున్నామన్న నిజం తెలుసా? మహా భారత యుద్ధమే ఇందుకు తార్కాణం. ఒక పర్ఫెక్ట్ వార్ టెక్నాలజీకి మోడల్ గా మహాభారత యుద్ధాన్ని చెప్పుకోవచ్చు. ఇవాల్టికి 5150 ఏళ్ల కింద జరిగిన మహాభారత యుద్ధాన్ని గురించి పెద్ద ఎత్తున పరిశోధనలు జరిగాయి. మహాభారత ఇతిహాసంలో చెప్పిన అంశాలు, న్యూఢిల్లీ, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో, హరప్పా, మొహంజదారో నాగరికతలు వెలువడ్డ ప్రాంతాల్లో ప్రపంచ ప్రసిద్ధులైన ఆర్కియాలజిస్టుల రీసర్చ్ మహాభారత యుద్ధం నాటి అనేక విషయాలను వెలుగులోకి తీసుకువచ్చాయి.

ఏన్షియెంట్ వార్‌లో అత్యంత శక్తిమంతమైన బాంబు పేలుళ్లు జరిగాయి. అర్జునుడు అణ్వస్త్రాన్ని ప్రయోగించినట్లు తెలుస్తోంది. యుద్ధం జరిగింది 18 రోజులే అయినా, అయిదువేల ఏళ్ల తరువాత కూడా దాని రేడియేషన్ ప్రభావం సజీవంగా కనిపించటం విశేషం. కురుక్షేత్రంలో జరిగిన యుద్ధంలో ఊహకందని అంశాలు కనిపిస్తాయి. వివిధ దేశాలు ఇవాళి ఆర్మీలో అనుసరిస్తున్న అనేక విభాగాలు కౌరవ, పాండవుల సైన్యంలో మనకు కనిపిస్తాయి. ఆనాటి ఒక ఆర్మీవింగ్ను అక్షౌహిణి అని పిలిచేవారు. ఒక అక్షౌహిణిలో 1,09, 000వేల మంది సైనికులు. 21,870 రథాలు, 21,870 యుద్ధ ఏనుగులు, 65,610 హార్స్ రైడర్లు ఉంటారు. ఆర్మీ జనరల్గా మహా సేనాపతి ఉంటాడు. ఆయన కింద లెఫ్టినెంట్ జనరల్, మేజర్ జనరల్, బ్రిగేడియర్, కల్నల్, లెఫ్టినెంట్ కల్నల్, మేజర్, కెప్టెన్, లెఫ్టినెంట్లుగా రకరకాల స్థాయిల్లో సైనికాధికారులు ఉండేవారు. కాకపోతే అప్పటి పేర్లు వేరు. ఇప్పటి పేర్లు వేరు. సైన్యం మోహరింపు కూడా స్పెసిఫిక్ వ్యూహం ప్రకారం ఉండేది. ఒక రథం, ఒక వార్ ఎలిఫెంట్, ముగ్గురు హార్స్ రైడర్లు, అయిదుగురు సైనికులు ఇది ఒక టీమ్ అన్నమాట. ఇదేమీ ఆషామాషీ మోహరింపు కాదు. ఒకసారి ఈ సైనిక వ్యూహంలో చిక్కుకున్నవాడు ఎంత గొప్పవాడైనా సరే ప్రాణాలతో బయటకు రావటం ఈజీ కాదు. అభిమన్యుడు ఇలాంటి పద్మవ్యూహంలో చిక్కుకుని ప్రాణాలు పోగొట్టుకున్నవాడే. యుద్ధంలో ఎత్తుకు పైఎత్తులు, కూటనీతి, మోసాలు, పవర్ ఆఫ్ వెపన్స్ వంటివన్నీ మహాభారత యుద్ధంలో స్పష్టంగా కనిపిస్తాయి. ఆధునిక యుద్ధవ్యూహాలు కురుక్షేత్ర యుద్ధం ముందు ఎందుకూ కొరగావు. కురుక్షేత్ర యుద్ధం నాటికి కౌరవ పాండవ సైన్యాలు ఆనాటికి అత్యంత ఆధునికమైన ఆయుధ సంపత్తిని సమకూర్చుకున్నాయి. ఇవాళ మనం ఏలియన్స్ పిలుచుకునే గ్రహాంతర వాసులు వారికి టెక్నాలజీ విషయంలో సహకరించారని గ్రహాంతర వాసుల గురించి పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.. ఈ ఏలియన్సులే భారత కాలంలో దేవతలు కావచ్చు. కురుక్షేత్ర యుద్ధంలో ఇరుపక్షాలూ చాలా శక్తిమంతమైన ఆయుధాలనే వాడాయి. కత్తులు, కటార్లు, బాణాలు, గదలు వంటి ట్రెడిషనల్ ఆయుధాలు ఎలాగూ వున్నాయి. వీటితో పాటు ప్రమాదకరమైన వార్హెడ్స్ ఉన్న మిస్సైల్స్ ప్రయోగాలు భారత వీరులు ఆనాడే చేసినట్లు తెలుస్తోంది. క్షిపణి ప్రయోగంలో భీష్మ, అర్జున, కర్ణులు గ్రేట్ వారియర్స్ అని చెప్పవచ్చు. అంతే కాదు.. వైమానిక దాడుల్లోనూ కురుపాండవ సైన్యాలు పాల్గొన్నాయి. పాండవసైన్యం వైమానికదాడి ద్వారా ఇందూస్ వ్యాలీలో న్యూక్లియర్ వెపన్ ప్రయోగించటం వల్ల అక్కడ సర్వనాశనం జరిగిందని ఆర్కియాలజిస్టుల అంచనా. దీని కాలాన్ని కూడా 5వేల సంవత్సరాల పైనేనని అంతర్జాతీయ నిపుణులు సైతం ధృవీకరించారు.

న్యూక్లియర్ వెపన్ టెక్నాలజీని పాండవులు అరణ్యవాస కాలంలో సాధించినట్లు తెలుస్తోంది. అడవిలో ఉన్న పన్నెండు సంవత్సరాల కాలాన్ని యుద్ధానికి తగిన ఆయుధాలను సమకూర్చుకోవటానికి పాండవులు అనుకూలంగా మార్చుకున్నారు. అణ్వస్త్రంతో పాటు దానికంటే వంద రెట్లు శక్తిమంతమైన పాశుపతాస్త్రాన్ని సైతం అర్జునుడు సంపాదించాడు. కానీ, దాన్ని అతను భారత యుద్ధంలో ప్రయోగించలేదు. వైమానిక దాడుల్లో మన వారు ఆనాడే మంచి టెక్నాలజీని వాడారు. భారత కాలంలో ఉపయోగించిన రవాణా, యుద్ధ విమానాల్లో మెర్క్యూరీని ఇంధనంగా వాడారు. ఈ విమానాలు కూడా ఇవాల్టి యుద్ధ విమానాలకు ఎంతమాత్రం తీసిపోవు. ఇప్పటి విమానాల మాదిరిగానే, నాటి విమానాలు సైతం వార్హెడ్లను కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. ఆధునిక ఆయుధాలు ఎన్ని వాడినా, సంప్రదాయ అస్త్రాలైన బాణాలకే భారత యుద్ధంలో ప్రాధాన్యం ఎక్కువ లభించింది. యుద్ధంలో పాల్గొన్న యోధులందరిలో దాదాపు 60 శాతం మంది విలుకాళ్లే కావటం విశేషం.. రకరకాల విష పూరిత అస్త్రాలతో శత్రువులపై దాడి చేయటంలో వీళ్లను మించిన వాళ్లు లేరు. మహాభారత యుద్ధం క్రీస్తుపూర్వం 3138 డిసెంబర్ 25న ప్రారంభమై 18 రోజుల్లో సుమారు 36 లక్షల మంది ప్రాణాలను బలిగొంది. ఇరువైపులా రాటుదేలిన యుద్ధ తంత్ర నిపుణులు ఉండటంతో కురుక్షేత్రం అస్థిపంజరాల గుట్టగా మారిపోయింది. చివరకు పోయినోళ్లందరూ పోగా మిగిలింది పదకొండు మంది. పద్మవ్యూహం.. దీని గురించి విననివారు బహుశా ఉండరు.. ఎవరైనా ప్రత్యర్థి వలలో చిక్కుకుపోతే ఒక జాతీయం లాగా అంటే ఇడియమెటిక్ ఎక్స్ప్రెషన్లా దీన్ని వాడతారు. ఈ పద్మవ్యూహం కురుక్షేత్ర యుద్ధంలో శత్రువును మట్టుపెట్టడానికి వేసిన పన్నాగం. అర్జునుడి కుమారుడు అభిమన్యుడు ఈ పద్మవ్యూహంలో చిక్కుకుని విలవిల్లాడిపోయాడు. తప్పించుకుని బయటకు ఎలా రావాలో తెలియక చనిపోయాడు. పద్మవ్యూహం మాదిరిగా సైన్యాన్ని ఒక చిక్కుముడిలా మోహరించటంలో కురుపాండవుల గురువు ద్రోణాచార్యుడు సిద్ధహస్తుడు. ఇలాంటి ఎత్తుగడలను కురుక్షేత్ర యుద్ధంలో ఇరుపక్షాలూ పెద్ద ఎత్తున వినియోగిం చుకున్నాయి. ఇటు కృష్ణుడు, దృష్టద్యుమ్నుడు, అటు భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు రెండు సైన్యాలకు థింక్ట్యాంక్గా ఉపయోగపడ్డారు.

18 రోజుల్లో జరిగిన యుద్ధంలో దాదాపు 19 వ్యూహాలను.. కురుపాండవులు ఒకరిపై ఇంకొకరు పన్నారు. అందులో పద్మవ్యూహం ఒకటి. ఇవి కాకుండా క్రౌంచ, మకర, చక్ర, గరుడ, మండల, వజ్ర వ్యూహాల్లాంటివి చాలా ఉన్నాయి. ప్రత్యక్ష యుద్ధంలో ఒకరి సైన్యంపై మరొకరి సైన్యం తలపడి యుద్ధం చేయాల్సిన పరిస్థితి. విమాన దాడులు, బాంబు పేలుళ్లకు ఇలాంటి వ్యూహాలు అవసరం లేదు. నేరుగా అస్త్ర ప్రయోగాలు జరుగుతాయి. జస్ట్ టార్గెట్ ఉంటే చాలు.. కురుక్షేత్రంలో చోటు చేసుకున్నది ప్రత్యక్ష పరోక్షాలు కలగలిసిన సమరం.. అందుకే వ్యూహ ప్రతివ్యూహాలతో యుద్ధంలో ఇరుపక్షాల వైపు నుంచి పాల్గొన్న యావత్ సైన్యం నామరూపాల్లేకుండా సమసిపోయింది. అన్నింటికీ మించి కురుక్షేత్రంలో జరిగిన జీవరసాయనాయుధాల ప్రయోగం.. పాములతో విషప్రయోగం చేయటం.. క్షిపణుల ద్వారా మత్తు వాయువులు గాల్లోకి వెదజల్లటం, రహస్యంగా మత్తుమందులు ఇవ్వటం వంటి ప్రయోగాలు కురుక్షేత్ర యుద్ధంలోనే జరిగాయి. నాగాస్త్రాలు, సమ్మోహకాస్త్రాలు తెలుగు సినిమాల్లో బాణాలుగానే కనిపిస్తాయి. కానీ, ఇవన్నీ ఆనాడు మనవాళ్లు వాడిన జీవ, రసాయన ఆయుధాలు. శల్యుణ్ణి మత్తు ఇచ్చే పాండవులు వశం చేసుకున్నారు.. కర్ణుడు నాగాస్త్రంతో విషప్రయోగం చేశాడు.. అర్జునుడు రెండుమూడు సార్లు సమ్మోహకాస్త్రాన్ని ప్రయోగించాడు. యుద్ధంలో కౌరవులు పెద్ద ఎత్తున విష సర్పాలను శత్రువులపైకి వదిలేశారు. గెలుపే ధ్యేయం.. ప్రత్యర్థిని ఓడించటమే లక్ష్యం.. శత్రువును ఏమార్చి పరిమార్చటం ఎలాగో మహాభారత యుద్ధం మనకు చెప్తోంది.

దాదాపు పదేళ్ల పాటు సాగిన రెండు ప్రపంచ యుద్ధాల్లో సుమారు రెండు కోట్ల మంది ప్రజలు, సైనికులు హతులయ్యారు.. కురుక్షేత్రంలో కేవలం 18 రోజుల్లోనే 36 లక్షల మంది చనిపోయారు.. మన ప్రపంచ యుద్ధాలు జరిగినట్లు పదేళ్ల పాటు జరిగితే భూమి మీద ప్రాణి అంటూ మిగులుతుందా? అసలు భూగోళమే ఉంటుందా? ఇంతమందిని మృత్యువాత పడేసేంత శక్తి కురుపాండవులకు ఉందా? వారి దగ్గర ఉన్న శక్తి సంపద ఏమిటి? కురుక్షేత్ర యుద్ధంలో ఎవరు ఎంత సత్తా చూపించారు?

(తదితర వివరాలు, తరువాయి భాగం.. వచ్చే వారం)



కోవెల సంతోష్ కుమార్
రచయిత, 91 9052116463

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.